ప్రజాశక్తి

ఆదివారం 24 నవంబర్ 2024 | 8 పేజీలు

గుంటూరు | పల్నాడు

జెడ్పీలో ప్రొటోకాల్ దుమారం

సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

- అధికారిక కార్యక్రమాల సమాచారం ఇవ్వట్లేదని మండిపడ్డ సభ్యులు
- అభివృద్ధి పనుల నిర్వహణ తీరుపైనా పెదవి విరుపులు
- పత్తి, ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి : ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-గుంటూరు

అధికారిక కార్యక్రమాలు, శిలాఫకాల ఏర్పాటులో ప్రొటోకాల్ ఉల్లంఘనలపై జెడ్పీ సర్వసభ్య సమావేశంలో సభ్యులు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రొటోకాల్ పాటించకపోవటంపై జెడ్పీటీసీలు, ఎమ్మెల్సీలు మండిపడ్డారు. గ్రామాల్లో తమకు తెలియకుండా అభివృద్ధి పనులు మంజూరు చేసి, ఇప్పుడు తమ ఆమోదం కోసం సమావేశంలో ప్రశేపెట్టటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన కొన్ని కార్యక్రమాలను ఉటంకిస్తూ, ప్రొటోకాల్ ఉల్లంఘనకు కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని పట్టుబట్టారు. ఉన్నతాధికారుల నుండి స్పష్టమైన హామీ ఇవ్వకపోతే అజెండాపై చర్చించేది లేదని తెగేసి చెప్పారు. సుమారు గంటపాటు దీనిపై తీవ్ర స్థాయిలో చర్చ సాగింది.

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన శనివారం జెడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ, లోక్‌సభ ప్యానెల్ స్పీకర్, బాపట్ల ఎంపి తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్సీలు కేఎస్ లక్ష్మణరావు, మురుగుడు హనుమంత రావు, చంద్రగిరి ఏసురత్నం, మర్రి రాజశేఖర్, ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, నక్కా ఆనంద్‌బాబు, పల్నాడు జిల్లా సంయుక్త కలెక్టర్ జి.సూరజ్ భరద్వజ్ ధనుంజయ్, బాపట్ల జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, అసిస్టెంట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, జెడ్పీటీసీలు, ఎంపిపిలు పాల్గొన్నారు.

తొలుత ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఇటీవల కాలంలో ప్రొటోకాల్ ఉల్లంఘనలు జరుగుతున్నాయని, ఎమ్మెల్సీలకు సమాచారం ఇవ్వట్లేదని అన్నారు. బాపట్ల స్వర్ణాంధ్ర సమావేశం, గుంటూరులో జరిగిన కౌల్దార్ల చట్టంపై సమావేశానికి సమాచారం ఇవ్వలేదన్నారు. డిఆర్‌సి సమావేశానికి తన సమాచారం ఇవ్వలేదని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు అన్నారు. ప్రొటోకాల్ ఉల్లంఘనపై రొంపిచర్ల జెడ్పీటీసీ పిల్లి ఓబుల్‌రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రాజ్యాంగేతర శక్తుల పేర్లు కూడా శిలాఫలకాల్లో ఉన్నాయని, తమ పేర్లు మాత్రం లేవని అన్నారు. తమకు తెలియకుండా మా గ్రామాల్లో ముందస్తుగానే పనులకు అనుమతులిచ్చి, ఇప్పుడు సభ్యుల ఆమోదం కోసం సభలో ప్రవేశపెట్టడం ఎంత వరకూ న్యాయమని ప్రశ్నించారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ మూసపద్ధతిలో నివేదిక తయారు చేశారన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా ప్రొటోకాల్ పాటించాలన్నారు.

2లో

అవినీతి ఒప్పందాల వల్లే విద్యుత్ భారాలు

వాటిని రద్దు చేసి అదానీని అరెస్టు చేయాలని సిపిఎం నిరసనలు

ప్రజాశక్తి-గుంటూరు

యడ్లపాడు నిరసనలో మాట్లాడుతున్న వై.రాధాకృష్ణ

విద్యుత్ ఒప్పందంలో అవినీతి, అక్రమాల వల్లే నేడు ప్రజలపై భారాలు పెరిగాయని సిపిఎం గుంటూరు జిల్లా జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.నేతాజీ, పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.రాధాకృష్ణ విమర్శించారు. ప్రభుత్వంతో జరిగిన ఒప్పందాల్లో అవినీతి, అక్రమాలకు పాల్పడ్డ అదానీని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ గుంటూరుతోపాటు పల్నాడు జిల్లాలోని యడ్లపాడు, పిడుగురాళ్లలో శనివారం నిరసనలు చేపట్టారు. గుంటూరు శంకర విలాస్ సెంటర్‌లో నిరసనలో సిపిఎం నగర కార్యదర్శి నళినీకాంత్ మాట్లాడుతూ ప్రభుత్వ పెద్దలకు లంచాలిచ్చి ఆయాచిత లబ్ధి పొందేందుకు కార్పొరేట్ శక్తులు ఇలాంటి చీకటి ఒప్పందాలు చేసుకుంటున్నారని, రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి ఒప్పందాలన్నీ రద్దు చేయాలని కోరారు. గతంలో కూడా అదానీపై ఇలాంటి ఆరోపణలే వచ్చినా కేంద్రప్రభుత్వ పెద్దల అండదండలు ఉండడంతో ఎలాంటి విచారణా జరగలేదని, ప్రస్తుతం అమెరికన్ ప్రభుత్వమే కేసు నమోదు చేయడంతో మన

2లో

సంక్షేమ హాస్టళ్లలో త్వరలో సిసి కెమెరాలు

- డిగ్రీ విద్యార్థులకూ గురుకుల కాలేజీ ప్రతిపాదన
- హాస్టల్ భవనం ప్రారంభోత్సవంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి బాల వీరాంజనేయ స్వామి

ప్రజాశక్తి - వినుకొండ

మాట్లాడుతున్న మంత్రి బాల వీరాంజనేయ స్వామి

రాష్ట్రంలో సాంఘిక సంక్షేమ హాస్టల్లో విద్యార్థులకు ప్రభుత్వం మెరుగైన సౌకర్యాలు కల్పిస్తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల బాలవీరాంజనేయ స్వామి చెప్పారు. పట్టణంలోని ఎన్‌ఎస్‌పి కాలనీలో నూతనంగా నిర్మించిన సాంఘిక సంక్షేమ వసతి గృహాలను మంత్రి శనివారం ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 190 సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలల్లో లక్షకు పైగా విద్యార్థులు చదువుతున్నారని, ఇంటర్మీడియట్ విద్యార్థులకూ హాస్టల్ వసతి ఉందని చెప్పారు. డిగ్రీ విద్యార్థులకు వసతి లేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ప్రకాశం జిల్లా సింగరాయకొండలో డిగ్రీ గురుకుల కాలేజీ ఏర్పాటుకు ప్రతిపాదించామని తెలిపారు. పైలెట్ ప్రాజెక్టు కింద ఐటిఐ పాలిటెక్నిక్ కాలేజీలను ఏర్పాటు చేస్తామన్నారు. సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో చదివిన వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వడం ద్వారా 42 మంది నీట్ ద్వారా ఎంబిబిఎస్ సీట్లు సాధించారని, 60 మంది ఐఐటి సాధించారని తెలిపారు. మెగా డీఎస్సీ ద్వారా 16,500 పోస్టులు భర్తీ చేయనున్న నేపథ్యంలో 2 వేల మంది హాస్టల్ విద్యార్థులకు, మరో వెయ్యి మంది గిరిజన విద్యార్థినులకు శిక్షణిస్తామని చెప్పారు. హాస్టళ్లలో త్వరలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి గురుకుల

2లో

పట్టభద్ర ఓటర్ల డ్రాఫ్ట్ విడుదల

- 2,90,978 మందితో జాబితా
- వచ్చేనెల 9 వరకు అభ్యంతరాల స్వీకరణ
- కొత్త ఓట్ల నమోదుకూ మరో అవకాశం

2లో

108 సేవలను ప్రభుత్వమే నిర్వహించాలి

- ఉద్యోగుల సమ్మెను నివారించాలి
- రౌండ్‌టేబుల్ సమావేశంలో రాజకీయపార్టీలు, ప్రజా సంఘాలు

సమావేశంలో మాట్లాడుతున్న పాశం రామారావు

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్రంలో 108 సేవలను నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలని, 108 అంబులెన్స్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, సోమవారం తలపెట్టిన సమ్మెను నివారించాలని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. కొన్ని రోజులుగా 108 అంబులెన్స్ ఉద్యోల ఆందోళనలు, 25న సమ్మె పిలుపు నేపథ్యంలో 108 అంబులెన్స్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక బ్రాడీపేటలోని యుటిఎఫ్ కార్యాలయంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు వై.శివశంకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, 108 అంబులెన్స్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.రామకష్ణ, సిపిఐ (ఎంఎల్) పార్టీ నాయకులు ఉల్లిగడ్డ నాగేశ్వరరావు, బీఎస్పీ నాయకులు సిహెచ్ వాసు మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో ఉన్న ప్రజల ప్రాణాలు కాపాడుతున్న ఉద్యోగుల సంక్షేమాన్ని విస్మరించటం తగదన్నారు. 108 నిర్వహణ సంస్థ వారి లాభాలు చూసుకుంటూ ఉద్యోగుల సంక్షేమం పట్టించుకోవట్లేదన్నారు. ఉద్యోగులు చందాలు వేసుకొని మరణించిన కుటుంబాలను ఆదుకుంటున్నారన్నారు. 108 ఉద్యోగులు

2లో

సంక్షేమ హాస్టళ్లలో త్వరలో సిసి కెమెరాలు

(మొదటి పేజీ తరువాయి)

పాఠశాల వద్ద పోలీసు రక్షణ కల్పిస్తామన్నారు. అనంతరం విద్యుత్ శాఖ మంత్రి కొట్టిపాటి రవికుమార్, ఏపీ అసెంబ్లీ చీఫ్ విప్, జీవీ ఆంజనేయులు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడారు. పల్నాడు జిల్లాలో బాల్యవివాహాలు జరుగుతున్నాయని, పదవ తరగతి పూర్తికాగానే ఎంతో మందికి వివాహాలు చేస్తున్నారని, నాణ్యమైన ఇంటర్ విద్యను అందించడం ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో నరసరావుపేట, మాచర్ల ఎమ్మెల్యేలు డాక్టర్ చదలవాడ అరవిందబాబు, జూలకంటి బ్రహ్మారెడ్డి, జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ కె.శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

108 సేవలను ప్రభుత్వమే నిర్వహించాలి

(మొదటి పేజీ తరువాయి)

కోరుతున్నవి గొంతెమ్మ కోర్కెలు కాదన్నారు. 108 వ్యవస్థను ప్రభుత్వం నడపటం సమంజసమన్నారు. ఎనిమిది గంటల పని విధానం, అధికారులు ఇచ్చిన హామీ ప్రకారం శ్లాబులు ప్రకారం వేతనాలు చెల్లించాలని, ఎక్స్‌పీరియన్స్‌ను బట్టి ఎప్పటికప్పుడు వేతన శ్లాబులు అప్‌డేట్ చేయాలని, వైద్యఆరోగ్య శాఖలో ఖాళీలను 108 ఉద్యోగులకు వెయిటేజ్ ఇచ్చి భర్తీ చేయాలని కోరారు. సహజ మరణం, ప్రమాదాలలో చనిపోయిన వారికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషన్ చెల్లించాలని, గతంలో టిడిపి ఇచ్చిన జీవో నంబర్ 49 ప్రకారం రూ.4 వేలు గౌరవ వేతనం పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం వేర్వేరు జిల్లాల్లో పని చేస్తున్న ఉద్యోగులను వారి సొంత జిల్లాలకు బదిలీ చేయాలని, ఖాళీలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలు కూడా ఉద్యోగుల సమస్యలను అర్థం చేసుకొని సమ్మెకు సహకరించాలని కోరారు. సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.లక్ష్మీనారాయణ, ఆలిండియా రోడ్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.శివాజీ, ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎంఎ చిష్టి, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ జేఏసీ జిల్లా చైర్మన్ బి.లక్ష్మణరావు, సెక్రెటరీ జనరల్ బి.ముత్యాలరావు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, ఐద్వా, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు కె.అజయ్‌కుమార్, కార్యదర్శి ఇ.అప్పారావు, ఎల్.అరుణ, ఎం.కిరణ్, వై.కష్ణకాంత్, ఎల్ఐసి యూనియన్ నాయకులు రాజేశ్వరరావు, గాంధీ రామ్మోహన్‌రావు, విద్యుత్ కాంట్రాక్ట్ యూనియన్ నాయకులు జి.నాగరాజు, బిల్డింగ్ వర్కర్స్ తూర్పు కార్యదర్శి పి.దీవెనరావు, 104 జిల్లా అధ్యక్షులు కె.సత్యరాజు, బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎం.సాంబశివరావు, సచివాలయం ఉద్యోగులు కె.అనురాధ పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాల్లో విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి- మాచర్ల రూరల్ : మాచర్ల గ్రంథాలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని మాచర్ల శాఖా గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ మేడం పుల్లారావు కోరారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా పట్టణ శాఖా గ్రంథాలయము నందు వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలపై పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థుల బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమం పట్టణ శాఖా గ్రంథాలయంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా పుల్లారావు మాట్లాడుతూ విద్యార్థులందరూ చదువుతోపాటుగా అనేక అంశాలపై నైపుణ్యతను పెంపొందించుకొని ఉన్నత స్థితికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం లైబ్రరీన్ ఫణింద్ర కుమార్, ఉపాధ్యాయ సంఘ నాయకుడు గాదె కిరీట్ రెడ్డి, అబ్దుల్ కలాం సేవా సమితి అధ్యక్షులు పాషావలి, శ్రీనివాసరావు, ఇరువంటి వెంకట శ్రీనివాసరావు, పల్నాడు, ప్రతిభ, వికాస్ డిగ్రీ కళాశాలల సెక్రటరీ - కరస్పాండెంట్ పఠాన్ నాగూర్ వలి బహుమతులను ప్రదానం చేశారు.

పట్టభద్ర ఓటర్ల డ్రాఫ్ట్ విడుదల

- 2,90,978 ఓట్లతో జాబితా
- వచ్చేనెల 9 వరకు అభ్యంతరాల స్వీకరణ
- కొత్త ఓట్ల నమోదుకూ మరో అవకాశం

జిల్లా	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
ఏలూరు	8998	5574	0	14572
కృష్ణా	31950	24601	5	56556
ఎన్‌టిఆర్	38270	26110	11	64391
గుంటూరు	50683	35980	16	86679
బాపట్ల	12883	7500	4	20387
పల్నాడు	32576	15814	3	48393
మొత్తం	175360	115579	36	290978

ప్రజాశక్తి-గుంటూరు

ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి వచ్చే ఏడాది మార్చిలో జరిగే ఎన్నికలకు సంబంధించి శనివారం ముసాయిదా ఓటర్ల జాబితాను అధికారులు విడుదల చేశారు. నియోజకవర్గం పరిధిలోని ఆరు జిల్లాలో ఓటరు దరఖాస్తులను పరిశీలించి 2,90,978 ఓట్లకు ఆమోదం తెలిపారు. వీరిలో పురుషులు 1,75,360 మంది, స్త్రీలు 1,15,579, ఇతరులు 36 మంది ఉన్నారు. ఈ ముసాయిదా జాబితాపై డిసెంబర్ 9వ వరకూ అభ్యంతరాలు స్వీకరిస్తారు. అభ్యంతరాల స్వీకరణతో పాటు కొత్త ఓట్ల దరఖాస్తునకూ ఈ సయమంలో మరోసారి అవకాశం కల్పించారు. గతంలో ఓటు నమోదు చేసుకోని వారు, చేసినా తిరస్కరణకు గురైన వారు మరోసారి నమోదు చేసుకునే అవకాశం ఉంది. జాబితాపై ఫారం అభ్యంతరాలకు ఫారం 7, సవరణకు ఫారం 8, కొత్తగా నమోదుకు ఫారం 18 పూర్తి చేసి ఇవ్వాలి. డిసెంబర్ 9 వరకూ వచ్చిన దరఖాస్తులను విచారించి తుది ఓటర్ల జాబితాను డిసెంబర్ 30న విడుదల చేస్తారు. ప్రస్తుత డ్రాఫ్ట్ జాబితా ప్రకారం 416 పోలింగ్ కేంద్రాలను అధికారులు గుర్తించారు. వాటిలో ఏలూరు జిల్లాలో 20, కృష్ణా 76, ఎన్‌టిఆర్ 101, గుంటూరు 118, బాపట్ల 28, పల్నాడు 73 కేంద్రాలున్నాయి.

జెడ్పీలో ప్రొటోకాల్ దుమారం

(మొదటి పేజీ తరువాయి)

నాదెండ్ల జెడ్పీటీసీ మస్తాన్‌రావు మాట్లాడుతూ ప్రజలు ఎన్నుకున్న తమ పేర్లు లేకుండా టిడిపి నాయకుల పేర్లను శిలాఫలకాల్లో వేస్తున్నారని చెప్పారు. ఆవిధంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాలను మార్చాలని పట్టుబడ్డారు. అమరావతి మండలం ఎనికేపాడు రోడ్డు నిర్మాణ శిలాఫలకంలో సర్పంచ్ పేర్లు, ఎంపిపి, జెడ్పిటీసీ పేర్లు లేవని ఎంపిపి హనుమంతరావు తెలిపారు. స్థానిక సంస్థలను చిన్నచూపు చూసే అధికారుల్ని సస్పెండ్ చేయాలన్నారు. సభ్యులు పట్టుబట్టడంతో పల్నాడు సంయుక్త కలెక్టర్ జి.సూరజ్ ధనుంజయ్ మాట్లాడుతూ అటువంటి శిలాఫలకాలు తొలగిస్తామని, భవిష్యత్‌లో పునరావృతం కాకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ ఇటువంటి ఉల్లంఘనలు ఎమ్మెల్యేలకు తెలియకుండా జరగవని, ఎమ్మెల్యేలతో సమావేశం జరిపి పునరావృతం కాకుండా చూడాలని కోరారు. అయినప్పటికీ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని జెడ్పిటీసీలు పట్టుబట్టారు. దీంతో కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కలుగచేసుకొని సర్ది చెప్పారు. భవిష్యత్‌లో పునరావృతం కాకుండా చూస్తామని చెప్పటంతో మిగతా సభ్యులు శాంతించారు.

దాన్యం కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించి, దాన్యం కొనుగోలు చేయాలని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు కోరారు. డెల్టా ప్రాంతంలో దాదాపు లక్ష ఎకరాల్లో వరి సాగైందని, కోతలు ప్రారంభమయ్యాయని, దళారులు రంగ ప్రవేశం చేశారని, కనీస మద్దతు ధర కంటే తక్కువకు కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. బాపట్ల జెసి ప్రఖర్‌జైన్ మాట్లాడుతూ సోమ, మంగళవారం నాటికి అన్ని కేంద్రాలు ప్రారంభిస్తామన్నారు. ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ పత్తి కొనుగోళ్లకు 12 శాతం తేమ నిబంధన విధింటచం విడ్డూరంగా ఉందన్నారు. రైతులు పత్తిని తడిపి తీసుకురావట్లేదని, మంచు పడి తేమ ఉంటుందని, దానికి రైతుల్ని బాధ్యులు చేసి ధర తగ్గించటం సరికాదని అన్నారు. 20, 30 కిలోమీటర్లు లోడ్ తీసుకెళ్లినా మంచి ధర వస్తుందనే నమ్మకం లేక ఇంటి వద్దతే అమ్ముకుంటున్నారన్నారు. నిబందనలు సడలించి రైతుల్ని ఆదుకోవాలన్నారు. దీనిపై కేంద్ర మంత్రి చంద్రశేఖర్ స్పందిస్తూ పత్తి కొనుగోళ్లలో సమస్యల పరిష్కారానికి తాను గత వారం రోజులుగా కృషి చేస్తున్నానని, సిసిఐ అధికారులతో మాట్లాడి అన్ని కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. తేమ శాతం నిబంధనను అడ్డుపెట్టుకొని దళారులు, అధికారులు కుమ్మక్కై ధరలు తగ్గిస్తున్నారన్నారు. రైతులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానన్నారు. కో-ఆప్షన్ సభ్యుడు షేక్.అష్మి ఇసుక సమస్యపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఉచిత ఇసుక ఎక్కడా అమలు కావట్లేదన్నారు. గతంలో టన్ను రూ.600 ఉంటే ఇప్పుడు రూ.900 అయ్యిందని, అమరావతి మండలంలోని రీచ్‌ల నుండి రాత్రి వేళ పెద్ద ఎత్తున ఇసుక దొంగ రవాణా జరుగుతోందని చెప్పారు. ఇసుక దొంగ రవాణను అరికట్టకుండా అధికారులు కళ్లు మూసుకున్నారని విమర్శించారు.

వ్యవసాయ రంగంపై చర్చ సందర్భంగా ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ కౌలు రైతులకు అందరికీ కార్డులు, రుణాలు ఇవ్వలేదన్నారు. గుంటూరు జిల్లాలో అతి తక్కువగా 9 వేల మందికే కార్డులు ఇచ్చారన్నారు. కౌలు రైతులు లేకుండా వ్యవసాయం లేదన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ కౌలు రైతులకు ఎంత మందికి ఇచ్చారని అధికారులను ప్రశ్నించగా ఆ వివరాలు లేవని వ్యవసాయాధికారి సమాధానం చెప్పారు. దుగ్గిరాల కోల్డ్ స్టోరేజి అగ్ని ప్రమాదంలో నష్టపోయిన రైతుల్ని ఆదుకోవాలని కోరారు. కేంద్ర మంత్రి స్పందిస్తూ త్వరలో పరిహారం విడుదల అవుతుందన్నారు. అమరావతి ఎంపిపి మాట్లాడుతూ మండలంలో రెండువేల హెక్టార్లకుగాను వెయ్యి హెక్టార్లకు పంట నమోదు లేదని ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వలేదని అన్నారు. లంక భూములు సాగు చేస్తున్న ఎవ్వరికీ పరిహారం అందలేదన్నారు. పంట నమోదులో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే రైతులు ఎందుకు నష్టపోవాలని ప్రశ్నించారు. రాజధాని ప్రాంతంలో అనధికారిక వెంచర్లను నిలువరించాలన్నారు. రబీలో పంటలు వేయటానికి కావాల్సిన శనగ విత్తనాలపై ప్రభుత్వ సబ్సిడీ పెంచాలని కోరారు. సబ్సిడీ విత్తనాల కంటే మార్కెట్ విత్తనాల ధరే తక్కువగా ఉందని నాదెండ్ల జెడ్పీటీసీ అన్నారు. ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ గుంటూరు పార్లమెంట్ పరిధిలో ఈక్రాప్ 9 వేల మందికి నమోదు కాలేదన్నారు. సిబ్బందే అలసత్వమే కారణం అన్నారు. సచివాలయ సిబ్బంది వారి వద్దకు వెళ్లి నమోదు చేయాలన్నారు. పంట రుణాలు కౌల్దార్లకు, భూమిపై రుణం యజమానికి ఇచ్చేలా జెడ్పీలో తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపాలన్నారు. విద్య శాఖ సమీక్షలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ గత మూడేళ్ల నుండి కాకుమాను గురుకుల పాఠశాలకు నీరు ఇవ్వలేకపోతున్నారన్నారు. నిధులున్నా నీరు ఇవ్వట్లేదని విమర్శించారు. ఎత్తిపోతల ట్రైబల్ స్కూల్‌లో 400 మంది ఉన్నారని, బాత్‌రూమ్ నిర్మించాలని మాచర్ల జెడ్పీటీసీ మల్లుస్వామి కోరారు. అనంతరం వైద్యం, గృహ నిర్మాణం, అభివృద్ధి పనులపై చర్చించారు. సమావేశంలో జెడ్పి సిఇఒ జ్యోతిబసు పాల్గొన్నారు.

పిడుగురాళ్లలో

అవినీతి ఒప్పందాల వల్లే విద్యుత్ భారాలు

(మొదటి పేజీ తరువాయి)

దేశ ప్రతిష్ట మసకబారిందని అన్నారు. అదానీ విదేశీ బొగ్గును 10 శాతం కొనాలని కేంద్రప్రభుత్వం రాష్ట్రాలకు షరతు పెట్టిందని, ఎక్కువ ధరకు కొన్న కారణంగా విద్యుత్ ఛార్జీలు పెరిగి ఆ భారం ప్రజలపై పడిందని తెలిపారు. ప్రస్తుత వివాదాలకు కారణమైన సోలార్ విద్యుత్ ఒప్పందం కూడా అలాంటిదేనని అన్నారు. తక్షణమే ఒప్పందాలన్నీ రద్దు చేసుకొని, అదానీని అరెస్ట్ చేయాలని, ప్రజలపై భారాలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా కార్యదర్శిసభ్యులు ఎన్ భావనారాయణ, జిల్లా నాయకులు ఎంఎ చిష్టి, బి.లక్ష్మణరావు నగర నాయకులు బి.ముత్యాలరావు, కె.శ్రీనివాసరావు, బి.సత్యనారాయణ, షేక్.ఖాశింషహీద్, జి.రమణ, ఎ.కళ్యాణి, షేక్.ఖాశింవలి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - యడ్లపాడు, పిడుగురాళ్ల : మండల కేంద్రమైన యడ్లపాడులోని పిఎస్ విజ్ఞాన కేంద్రం నుండి జాతీయ రహదారి వరకు సిపిఎం శ్రేణులు శనివారం నిరసన ప్రదర్శన చేపట్టాయి. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాల్లో అవినీతి జరిగిందని, యూనిట్ విద్యుత్ ధర రూ.2.49కు ఒప్పందం చేసుకోగా గుజరాత్‌తో రూ.1.99గా ధర నిర్ణయించారని తెలిపారు. ఇదే క్రమంలో ప్రజలపై మోయలేని విధంగా భారాలు వేస్తున్నారని చెప్పారు. అవినీతికర ఈ ఒప్పందాలను రద్దు చేయడంతోపాటు ప్రజలపై విద్యుత్ భారాలను ఉపసంహరించుకోవాలని కోరారు. నిరసనలో నాయకులు ఎన్.కాళిదాసు, కె.రోశయ్య, ఎన్.తులశయ్య, గురుస్వామి, పుల్లయ్య పాల్గొన్నారు. పిడుగురాళ్ల పట్టణం బ్యాంక్ సెంటర్‌లో జరిగిన నిరసనలో సిపిఎం మండల కన్వీనర్ టి.శ్రీనివాసరావు మాట్లాడారు. షేక్ బాబు, రామకష్ణ, కోటిరెడ్డి, నాగేంద్రం, మధుబాబు, షేక్ హుస్సేన్, డి.కొండలు, కె.భాస్కర్‌రావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కర్మ సిద్ధాంతం వల్లే హక్కుల్లో వెనకబాటు

వర్సిటీ సదస్సులో రెక్టార్ రత్నషీలామణి

ప్రజాశక్తి - ఎఎన్‌యు : చట్టంలో స్త్రీ, పురుషులు సమానమే అన్నప్పటికీ భారతదేశంలో ఇప్పటికీ మహిళని ద్వితీయ శ్రేణి పౌరుడిగా గుర్తిస్తున్నారని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ రెక్టార్ కె.రత్నశీలామణి అన్నారు. శనివారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని పీజీ డిపార్ట్మెంట్ ఆఫ్ లీగల్ స్టడీస్ అండ్ రీసెర్చ్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్కూల్ ఆఫ్ లీగల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ విభాగాలు సంయుక్తంగా లీగల్ ఎయిడ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రెక్టార్ మాట్లాడుతూ భారతదేశం కర్మ సిద్ధాంతాన్ని ఆచరిస్తుండటంతో ప్రజలు తమ హక్కులని గుర్తించడంలో వెనుకబడ్డారని అన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. సింహాచలం మాట్లాడుతూ వ్యక్తుల హక్కులను కాపాడేందుకు యూనివర్సిటీ యంత్రాంగం కృషి చేస్తుందని చెప్పారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ కామర్స్ అండ్ లా ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎం.సురేష్ కుమార్ మాట్లాడుతూ న్యాయ సలహాలు ఈ రోజున అంగడి సరుకులు లాగా మారిపోయాయని అన్నారు. నేడు న్యాయ సహాయం అందించటానికి అనేక వ్యవస్థలతో పాటు అనేకమంది న్యాయ నిపుణులు అందుబాటులో ఉన్నా వాటిని అందుకుని లబ్ధి పొందేవారు చాలా తక్కువ మంది ఉన్నారని పేర్కొన్నారు. గుంటూరు ఫ్యామిలీ కోర్టు మరియు 12వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి జి. చక్రపాణి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వేధింపుల గురించి సంబంధిత చట్టంలోని సెక్షన్ 3 నుంచి 5ఎ గురించి వివరించారు. జిల్లా న్యాయ సేవ సాధికారత సంస్థ కార్యదర్శి, సీనియర్ డివిజన్ సివిల్ జడ్జ్ లీలావతి మాట్లాడుతూ పని ప్రదేశాల్లో మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులు గురించి సంబంధిత చట్టాలపై అవగాహన కల్పించారు. గుంటూరు నాలుగవ అదనపు సీనియర్ డివిజన్ సివిల్ జడ్జ్ ఎం.కుమిదిని మాట్లాడుతూ గృహ హింస చట్టాలు, తీర్పులను ఉదహరించారు. న్యాయ విభాగాధిపతి ప్రొఫెసర్ లక్కరాజు జయశ్రీ, వర్సిటీ కళాశాల ప్రిన్సిపల్ సురేష్ కుమార్, న్యాయవిభాగపు అధ్యాపకులు డాక్టర్ నూతక్కి సతీష్, డాక్టర్ పివి రమణ, డాక్టర్ వైఎన్‌వి కిషోర్ కుమార్, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ జి.సతీష్ కుమార్, డాక్టర్ జ్యోతి సంపూర్ణ, చెన్నారావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీకుమారుడు మృతి

ప్రజాశక్తి - కొల్లిపర

తండ్రి, కుమారుని మృతదేహాల వద్ద రోదిస్తున్న బంధువులు

రోడ్డు ప్రమాదంలో తండ్రీ, కొడుకు మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి తెనాలి మండలం కాజీపేట వద్ద చోటు చేసుకుంది. ఈ సంఘటనలో కొల్లిపర మండలం తూములూరుకు చెందిన అవుతు రవీంద్రారెడ్డి (46), అవుతు హరినాథ్‌రెడ్డి (19) మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మృతుని కుటుంబం గత కొంతకాలంగా తూములూరు నుంచి వెళ్లి పెదకాకాని మండలం నంబూరు గ్రామంలో నివసిస్తున్నారు. తన పినతల్లి అంత్యక్రియలకు స్వగ్రామమైన తూములూరు వచ్చి తిరుగు ప్రయాణంలో బైక్ పై భార్య, కుమారునితో వెళుతుండగా కాజీపేట వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో కుమారుడు హరినాథరెడ్డి అక్కడికక్కడే మృతిచెందగా గాయపడిన రవీంద్రారెడ్డిని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య సురేఖ స్వల్ప గాయాలతో బయటపడింది. మృతదేహాలను తెనాలి ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించి శనివారం బంధువులకు అప్పగించారు. మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించారు. మృతునికి కుమార్తె కూడా కలదు.

మహారాజశ్రీ 15వ అదనపు జిల్లా కోర్టు, నూజివీడు

E.P.No.10/23, O.S.No.43/15

Between:
గోగం రాజేశ్వరి ...డిక్రీ హోల్డర్
మరియు
గంపా శ్రీహరి, S/o.గంగరాజు ...జడ్జిమెంటు డెబ్టార్

To.
Gampa Sri Hari, S/o.Late Ganga Raju, Rtd Govt Employee, Hindu, Aged 68 Yrs, R/o.3-680/3, 39 Feet Road, Amaravathi Road, Undavalli Centre, Tadepalli, Guntur Dist.

ఇందుమూలంగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా పైన పేర్కొన్న Judgement Debtor కు నోటీసులు ఎన్నిసార్లు కోర్టు ద్వారా పంపించిన వారు అట్టి కోర్టు నోటీసులను తీసుకొనక కాలయాపన చేస్తున్నారు. కోర్టు వారు వార్కి (JDR) కు Publication ద్వారా తెలియపర్చమని Order చేసియున్నారు. కావున మీరు గాని మీ తరుపున లాయరు గారి ద్వారా ది.19-12-2024 ఉదయం 10.30 గం॥లకు పైన పేర్కొన్న కోర్టు నందు హాజరు కావలసియున్నది. లేనియడల పరోక్షంగా తదుపరి గ్రంథము జరుపబడును.

శ్రీకోర్టు వారి ఉత్తర్వులతో
నూజివీడు — పి.దుర్గారావు
తేది.22-11-24 — అడ్వకేటు For DHR
నూజివీడు, నూజివీడు మండలం.
సెల్: 9000437767

CHANGE OF NAME

I, **GUDIBANDI RAVIKIRAN**(Old Name), S/o. **Brahma Reddy**, resident of D.No.3-57, Penumaka, Guntur-522501, A.P. I have changed my name from **GUDIBANDI RAVIKIRAN** (Old Name) to **GUDIBANDI RAVIKIRAN REDDY** (New Name). Henceforth, I will be called and known as **GUDIBANDI RAVIKIRAN REDDY** for all purposes.

తెనాలి కెకెఆర్ స్కూల్‌కు షోకాజు

కిటికి అద్దం జారిపడి విద్యార్థికి గాయాలు

ప్రజాశక్తి-గుంటూరు : తెనాలిలోని కెకెఆర్ గౌతం స్కూల్ విద్యార్థికి ప్రమాదం ఘటనలో పాఠశాలకు జిల్లా విద్యాశాఖ అధికారి సి.వి.రేణుక షోకాజు నోటీసు ఇచ్చారు. పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్న షేక్.మెహరాజ్ అనే విద్యార్థి పాఠశాల అనంతరం సైకిల్ స్టాండ్‌లో తన సైకిల్ తీసుకుంటున్న సమయంలో, పాఠశాల భవనం ఐదో అంతస్తు నుండి కిటికీ, కిటికీ అద్దాలు మీద పడటంతో తలకు తీవ్రమైన గాయాలు అయ్యాయని, వెంటనే ఆ విద్యార్థిని సమీపంలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు తీసుకెళ్లి బ్రెయిన్ స్కాన్, సిటీ స్కాన్ తీయించారని, చికిత్స చేసిన అనంతరం ప్రమాదం ఏమి లేదని వైద్యులు తెలిపారని డిఇఒ తెలియజేశారు. అబ్జర్వేషన్ కోసం ఆసుపత్రిలో ఉంచారన్నారు. ఎంఇఒ ద్వారా పూర్తి నివేదిక తెప్పించుకొని, విద్యార్థి వైద్య ఖర్చులను యాజమాన్యం భరించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. పాఠశాలలో రక్షణ చర్యలు తీసుకోవటంలో అలసత్వం వహించిన యాజమాన్యానికి షోకాజు నోటీసులు ఇవ్వటం జరిగిందని, పాఠశాల గుర్తింపు ఎందుకు రద్దు చేయకూడదో తెలపాలని వివరణ కోరటం జరిగిందని తెలియజేశారు.

గల్లంతైన బాలిక కావ్య మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-ఈపూరు : మండలంలోని ఆరేపల్లి ముప్పాళ్ళ సమీపంలోని అద్దంకి బ్రాంచి కాలువలో గల్లంతైన అక్కా, చెల్లెళ్ళు యామిని (10), కావ్య (5) మృత దేహాలను ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది గుర్తించారు. కాలువలో మరబోట్ల సాయంతో ఎన్‌డిఆర్ఎఫ్ బృందం గాలింపు చేపట్టారు. యామిని మృత దేహం శుక్రవారం లభ్యం కాగా, కావ్య మృతదేహాన్ని శనివారం ఉదయం గుర్తించి బయటకు తీశారు. అనంతరం పోస్టుమార్టం నిర్వహించారు. మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. రెవెన్యూ, పోలీసులు గాలింపు చర్యలను దగ్గరుండి పర్యవేక్షించారు.

ఇద్దరు బెల్టుషాపు నిర్వాహకులు అరెస్టు

ప్రజాశక్తి-ఈపూరు : ఈపూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని రొంపిచర్ల మండలంలో శుక్రవారం రాత్రి ఎక్సైజ్ పోలీసులు దాడులు చేసి విప్పర్లపల్లి గ్రామంలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న దాదాసాహెబ్ ను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుండి అడ్మిరల్ ఫైన్ విస్కీ 10 పద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. అలాగే క్రాస్ తనిఖీ బృందంతో కర్లకుంట గ్రామంలో దాడులు చేసి బెల్ట్ షాపు నిర్వాహకుడు నరసింహారావును అదుపులోకి తీసుకొని అతని వద్ద నుండి కేరళ మల్టీడ్ విస్కీ 11 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె శ్రీనివాసరావు తెలిపారు.

సిజిహెచ్‌ఎస్ రాష్ట్ర కార్యాలయాన్ని అమరావతిలో నెలకొల్పాలి

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

ఆంధ్రప్రదేశ్‌లో నూతనంగా ఏర్పాటయ్యే 'సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్' (సి.జి.హెచ్.ఎస్) రాష్ట్ర కార్యాలయాన్ని విశాఖపట్నంలో కాకుండా గుంటూరు లేదా విజయవాడలో ఏర్పాటు చేయాలని సెంట్రల్ బోర్డు ఆఫ్ ఇండైరెక్ట్ ట్యాక్స్ అండ్ కస్టమ్స్ (సి.బి.ఐ.సి) రాష్ట్ర పెన్షనర్ల సంఘం కోరింది. గుంటూరు కలెక్టరేట్ వద్ద గల సి.జి.హెచ్.ఎస్ కార్యాలయానికి తనిఖీ నిమిత్తం వచ్చిన సి.జి.హెచ్.ఎస్ అడిషనల్ డైరెక్టర్ దండు పూర్ణచంద్రరావు ని (హైదరాబాద్) సి.బి.ఐ.సి రాష్ట్ర పెన్షనర్ల సంఘం కలిసి పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రాన్ని సమర్పించింది. ఎ.పి లోని 26 జిల్లాలకు గాను, కేవలం ఏడు చోట్ల మాత్రమే సి.జి హెచ్.ఎస్ వెల్నెస్ సెంటర్లు ఉన్నాయని, వీటి సంఖ్య మరింత పెంచాలని వినతి పత్రం లో విజ్ఞప్తి చేసారు. ఇప్పటి వరకు ఉభయ తెలుగు రాష్ట్రాలకు కలిపి ఒకటే సి.జి.హెచ్.ఎస్ అడిషనల్ డైరెక్టర్ కార్యాలయం వుందని, ఎ.పి లో నెలకొల్పే ఎ.డి కార్యాలయాన్ని రాజధాని అమరావతిలో త్వరగతిన ఏర్పాటు చేయాలన్నారు. ఉద్యోగులు, పెన్షనర్ల సి.జి.హెచ్ ఎస్ కొత్త కార్డుల దరఖాస్తులను హైదరాబాద్ కు పంపే విధానానికి స్వస్తి పలికి, పాత విధానంలోనే ఆయా వెల్నెస్ కేంద్రాలలో కొత్త కార్డులు మంజూరు, రెన్యువల్ చేయాలన్నారు. పెన్షనర్లకు ఇండెంట్ ఔషధాలు పంపిణీ చేయని మెడికల్ షాపుల టెండర్లను తక్షణం రద్దు చేయాలన్నారు. సర్జరీలకు అదనపు మొత్తాన్ని డిమాండ్ చేస్తున్న ఆసుపత్రులకు భారీ జరిమానా విధించాలన్నారు. మంగళగిరి ఎయిమ్స్‌లో వైద్య అనుమతులకు పెన్షనర్ల కోసం ప్రత్యేకంగా ఒక సి.జి.హెచ్.ఎస్ డాక్టర్‌ను నియమించాలన్నారు. వృద్దులు, మహిళలు క్లినిక్‌కు రాలేని పరిస్థితుల్లో మందులు, ఓ.పి కొరకు కుటుంబీకులకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సి.బి.ఐ.సి రాష్ట్ర పెన్షనర్ల సంఘం నాయకులు టి వివేకానంద, గద్దె తిలక్, పి.కోటేశ్వరరావు, గుమ్మడి సీతారామయ్య చౌదరి సి.జి.హెచ్.ఎస్ వైద్యులు పాల్గొన్నారు.

మహారాజ శ్రీ సత్తెనపల్లి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)వారి కోర్టులో

O.S NO: 62/2021

బిట్వీన్
1. వంకాయలపాటి లింగమ్మ
2. జువ్వ గంగాభవాని
3. కోటపాటి అనూష ... వాదులు

VS

1.కూకట్ల రమణమ్మ
2.పలుకూరి వెంకటసుబ్బయ్య ....ప్రతివాదులు

To,
1.కూకట్ల రమణమ్మ , భర్త : సూర్యనారాయణ, నందిగామ గ్రామం, సత్తెనపల్లి మండలం, పల్నాడుజిల్లా.
2.పలుకూరి వెంకటసుబ్బయ్య, తండ్రి : సుబ్బారాయుడు, డోర్ నెం.8-3-169/60/118, బోరబండ, నవీన్ నగర్, ఎస్.పి.ఆర్ హిల్స్, ఖైరతాబాద్, యూసఫ్ గూడ, హైదరాబాద్, తెలంగాణ ......ప్రతివాదులు

పై నెంబరు గల దావా లో శ్రీ కోర్టు వారు మీ యొక్క హాజరు నిమిత్తము ది 27-11-2024 వ తేదీకి వాయిదా వేసియున్నారు.కావున వాయిదా తేదీన పై తెలిపిన కోర్టు లో ఉదయం 10.30 ని:లకు స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాని హాజరయి మి యొక్క ఆక్షేపణలు తెలుపుకోవలయును. లేనిచో మీ పై పరోక్షముగా తీర్మానించబడుననీ ఇందు మూలముగా తెలియ జేయడమైనది .

కోర్టు వారి ఉత్తర్వులమేరకు
వాయిదా తేదీ. 27-11-2024
శ్రీ బి.ఎల్. చిన్నయ్య,
వాది తరుపు న్యాయవాది,
సత్తెనపల్లి. సెల్ :9848771757

మహారాజశ్రీ తెనాలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో

ఓ.యస్.నెం. 111/2019

బిట్వీన్
Madasu Raju (died)
Madasu Prameela and others.... వాదులు
ఎదిరి
Madasu Naga Bhushanam (died)
Madasu Prasad and others .... ప్రతివాదులు

To,
D7 : Madasu Mary Kumari W/o Jaya Rao
D8 : Madasu Anusha, D/o Jaya Rao
D9 : Madasu Sarika, D/o Jaya Rao
All are R/o Balijepalli Village, Vemuru Mandal, Bapatla District.

పై నెంబరులో వాది సదరు కోర్టులో పర్మినెంట్ ఇంజక్షన్ కొరకు దావా దాఖలు చేసియున్నందున మీ హాజరు నిమిత్తం ది. 29-11-2024వ తేదీకి వాయిదా వేసియున్నారు. సదరు వాయిదారోజు ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ, మీ తరఫు న్యాయవాది ద్వారా గానీ శ్రీ కోర్టువారి యెదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొన వలెను. లేనియెడల సదరు దావాను మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)
వాయిదా : 29-11-2024 — జి.దీపక్,
వాది తరఫు అడ్వకేట్, తెనాలి.
సెల్ : 9010634952.

ప్రకటన

గుంటూరు జిల్లా, కొలకలూరు గ్రామానికి చెందిన పిడపర్తి స్నేహలత, భర్త : రవికుమార్‌కు చెందిన మంగళగిరి మున్సిపల్ కాంప్లెక్స్ ప్రక్కన, 1వ వార్డు పార్కురోడ్డు, 1వ అడ్డరోడ్ డోర్ నెం.1-12-15 పరిధిలోని సర్వే నెం. 278/1లో గల 3 సెంట్ల ఖాళీ స్థలంకు సంబంధించి ఒరిజినల్ నకల్‌ను తీసుకొని తెనాలి నుండి గుంటూరు నవంబర్ 18న ఆర్‌టిసి బస్సులో వెళుతుండగా ఆ నకలు వున్న కవర్ జారి పోయినది. ఎంత వెదికినా దొరకలేదు. పై భూమికి సంబంధించిన ఒరిజినల్ నకలు డాక్యుమెంట్ ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌కు అందజేయగలరు.

ఇట్లు
పిడపర్తి స్నేహలత, భర్త : రవికుమార్,
కొలకలూరు, తెనాలి మండలం.
సెల్ : 9290764257

మాజీ డిప్యూటీ సిఎం ధర్మాన కృష్ణదాస్‌పై ఫిర్యాదు

ప్రజాశక్తి - తుళ్లూరు

వైసిపి ప్రభుత్వంలో డిప్యూటీ సిఎం గా పనిచేసిన ధర్మాన కృష్ణ దాస్ పై మండలంలోని పెదపరిమికి చెందిన కర్నాటి శ్రీనివాసరావు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజధాని రైతులను పెయిడ్ కూలీలని, అమరావతి ఉద్యమాన్ని కించపరుస్తూ రైతుల మనోభావాలు దెబ్బతినేలా అసభ్యకర పద జాలంతో దూషించిన కృష్ణ దాస్ పై కేసు నమోదు చేసి తగు చర్యలు తీసుకోవాలని శ్రీనివాసరావు ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఎఆర్ కానిస్టేబుల్‌కు నివాళి

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు లో తుపాకీ పేలిన ఘటనలో మరణించిన ఏ. ఆర్. కానిస్టేబుల్ జి. శ్రీనివాస్ భౌతిక కాయాన్ని ఎం. ఎల్.సి. చంద్రగిరి ఏసురత్నం శనివారం సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్పొరేటర్ చంద్రగిరి కరుణ కుమారి వైసిపి యువ నాయకులు చంద్రగిరి ధీరజ్ పాల్గొన్నారు.

మహారాజశ్రీ పొదిలి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఓ.ఎస్.నెం:131/2022

విజయ బ్యాంక్ పొదిలి నౌ మెర్జెడ్ ఇన్ బ్యాంక్ ఆఫ్ బరోడా రిప్రెజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్ పొదిలి ... వాది

వర్సెస్

ప్రత్తిపాటి గౌతమి మరియు ఒకరు... ప్రతివాదులు

టు,
D1) ప్రత్తిపాటి గౌతమి భర్త సుబ్బారావు, డోర్ నెం:1-181, సొపాడు గ్రామం, వట్టిచెరుకూరు మండలం, గుంటూరు జిల్లా.

దావా సమను

పై నెంబరు వాది లోను అమౌంట్ పరిహారమును రాబట్టే నిమిత్తం డిక్రీ కోరి మీ మీద దావాను పై వారి కోర్టులో దాఖలు చేయగా ప్రతివాదులు అయిన మీకు దావా సమనులు జారీ నిమిత్తం తేదీ: 17-12-2023 నకు వాయిదా కలదు. సదరు తేదీన మీరు ఉదయం గం.10:30 ని.లకు మీరు గాని మీ తరుపు లాయర్ గారి ద్వారా గాని పై వారి కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలుపవలసినది. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడునని తెలుసు కొనవలయును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేదీ : 17-12-2023 — ఇట్లు
పురాణం సుబ్రహ్మణ్యం,
తాడికొండ రామ్మోహన్ రావు,
వాది తరపు అడ్వకేట్స్,
పొదిలి, ప్రకాశం జిల్లా.
సెల్ : 9885636729.

మహారాజశ్రీ గౌరవనీయులైన ప్రిన్సిపల్ సివిల్‌జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టు : సత్తెనపల్లి.

O.S No : 614/2022

బిట్వీన్
కరుమూడి నాగరాజు ....వాది
మరియు
సోమేపల్లి నరసింహారావు .... ప్రతివాది

టు :
సోమేపల్లి నరసింహారావు, తండ్రి : పున్నయ్య, నివాసం : డోర్ నెం. 15-10-11, వడ్డవల్లి, సత్తెనపల్లి టౌన్ మరియు మండలం, పల్నాడుజిల్లా.

పై నెంబరు గల దావాలో వాది మీపై ప్రామిసరీ నోటు బాకీ నిమిత్తం దావా దాఖలు చేయగా మీకు కోర్టు ద్వారాను, పోస్టు ద్వారాను సమన్లు పంపియున్నను మీరు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టువారు మీ యొక్క హాజరు నిమిత్తం ది. 25-11-2024న వాయిదా వేసియున్నారు. ఆ రోజున మీరు స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలియజేయ వలసినదిగా యిందుమూలంగా తెలియజేయడమైనది. లేనిచో మీపై పరోక్షంగా తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదాతేది : 25-11-2024
శ్రీ పి.వి.నరసింహశాస్త్రి,
అడ్వకేట్, సత్తెనపల్లి.

మహరాజశ్రీ మంగళగిరి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టు అందు.

ఓ.యస్.62/2022

Between
M/S.Ultratech,cements LTD
Having its unit at Vaddeswaram rep by its Spl. Power of Attorney M.Ganapathi Subramaniyan ... వాది
M/S.Kamadhenu Assosiates, Bhavannarayana Colony, Ponnuru, Guntur District. .... ప్రతివాది

పై నెంబర్ దావాను వాది మీ పై శ్రీ కోర్టు వారి అందు రికవరీ ఆఫ్ మనీ నిమిత్తం దాఖలు చేసి, ఎన్ని పర్యాయములు కోర్టు వారి నుండి సమన్లు పంపినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున, శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు మీరు ది.26.11.2024న పై కోర్టు వారి ఎదుట ఉదయం 10.30 గంటలకి స్వయంగా గాని వకీలు ద్వారా గాని మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేని యెడల మీపై ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని తీర్మానింపబడును. అని ఈ ప్రకటన ద్వారా తెలియపరచడం అయినది.

(కోర్టులో ఉత్తర్వుల మేరకు)
వాయిదా: 26.11.2024

ఇట్లు
శ్రీ లంకా శివరామ్ ప్రసాద్
వాది తరుపు న్యాయవాది, మంగళగిరి

మహారాజశ్రీ అద్దంకి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

IA. NO: 614/2023,
IA. NO: 615/2023,
IA. NO: 616/2023
O.S. NO: 296/2016

కొనిదెన శివాజీ .....పిటిషనర్

V/s

చందొలు శివరామకృష్ణ (డైడ్) మరికొందరు ....రెస్పాండెంట్లు

To
R4)చందొలు వినోద్ కుమార్ S/o శివరామకృష్ణ, కొమ్మూరు గ్రామం, కాకుమాను మండలం, గుంటూరు జిల్లా.

పై నంబరు దావాలో చనిపోయిన 1వ ప్రతివాది శివరామకృష్ణకు వారసులుగా మిమ్ములని చేర్పించుటలో అయిన ఆలస్యమును మిమ్ములను వారసులగా చేర్పించమని కోరుచూ పిటీషన్లు దాఖలా చేసి మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నారని మీరు 23-12-2024 న ఉదయం 10:30 నుండి సాయంత్రం 5 గంటల లోపు పై కోర్టు వారి ఎదుట హాజరై తమ ఆక్షేపణలు తెలుపుకునేది. లేనిచో పిటిషన్లను మీ పరోక్షంగా తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వులతో//
మోతుకూరి సుభాష్‌బాబు
మురకొండ చంద్రశేఖర్
అడ్వకేట్స్, అద్దంకి

పురుగు మందుల షాపులో తనిఖీ

ప్రజాశక్తి - పెదనందిపాడు

మండలంలోని పురుగు మందుల షాపుల్లో పొన్నూరు ఏడిఏ వి రామకోటేశ్వరి, పెదనందిపాడు వ్యవసాయ అధికారి సుధారాణి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. రికార్డులను పరిశీలించి, అనుమతి పత్రాలు లేని పురుగు మందులను అమ్మరాదని, కొనుగోలు చేసిన రైతులకు బిల్లులు ఇవ్వాలని, స్టాక్ బోర్డులలో ప్రతి రోజూ నిల్వలను నమోదు చేయాలని తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించిన యెడల పురుగుల మందుల చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. శనివారం తనిఖీల్లో అనుమతి పత్రాలు లేకపోవడంతో రూ.1,06,625 ల విలువ గల పురుగు మందుల అమ్మకాలను నిలిపి వేశారు.

మార్షల్ ఆర్ట్స్ యూనివర్సిటీ స్థాపనకు కృషి

- యువతులకు, మహిళలకు కుంగ్ ఫూ, కరాటే చాలా అవసరం
- నరసరావుపేట కేంద్రంగా న్యూమాన్స్ కుంగ్ ఫూ ఆర్గనైజేషన్ - నేడు ఎన్ఇసిలో ప్రారంభం
- తల్లి ఊరు నరసరావుపేటతో విడదీయరాని అనుబంధం : సినీ నటుడు నరేష్

ప్రజాశక్తి- పల్నాడు జిల్లా

మహిళలకు, యువతులకు కుంగ్ ఫూ, కరాటే, శిలంబం నేర్చుకోవడం చాలా ముఖ్యమని న్యూ మాక్స్ కుంగ్ ఫూ అసోసియేషన్ జాతీయ గౌరవాధ్యక్షులు, సినీ నటులు నరేష్ అన్నారు. న్యూ మాక్స్ కుంగ్ ఫూ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల సౌజన్యంతో సౌత్ ఇండియా ఛాంపియన్‌షిప్ కుంగ్ ఫూ, శిలంబం, భరతనాట్యం ప్రారంభోత్సవం కార్యక్రమం ఆదివారం జరగనుంది. ఈ సందర్భంగా స్థానిక ఏ1 ఫంక్షన్ హాల్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రపంచంలో ఏ దేశంలోనూ మార్షల్ ఆర్ట్స్ యూనివర్సిటీ లేదన్నారు. మొట్ట మొదటిసారిగా ఇండియాలో స్థాపించాలనే పట్టుదలతో ఫౌండర్, గ్రాండ్ మాస్టర్ రవికుమార్, జాతీయ అధ్యక్షులు రాజా శిఖామణి ప్రోద్బలంతో ముందుకు వెళుతున్నట్లు చెప్పారు. జాతీయ స్థాయిలో సంస్థ కార్యకలాపాలను ఉత్తర, దక్షిణ భారతదేశంలో 6 రాష్ట్రాలలో విస్తరించినట్లు తెలిపారు. పల్నాడు జిల్లా స్థాయిలో ఈ ప్రాంతంలో సంస్థ కార్యకలాపాలు ప్రారంభించి మహిళలకు, యువతకు, పోలీస్ ఫోర్సెస్‌కు అవగాహన కల్పించడం, శిక్షణ ఇవ్వడం చేస్తామన్నారు. ఇప్పటికే ఆంధ్ర, తెలంగాణలోని పలు జిల్లాల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం ఎన్ఇసి కళాశాలలో నిర్వహించే కార్యక్రమంలో ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీ పాల్గొంటారని తెలిపారు.

మా అమ్మ పుట్టినిల్లు నరసరవుపేట

తన తల్లి విజయనిర్మల పుట్టినిల్లు నరసరవుపేట కావడంతో నరసరవుపేటతో విడదీయరాని అనుబంధం ఏర్పడిందని, తన సొంత ఊరు నరసరవుపేట అని నరేష్ చెప్పారు. నరసరావుపేటలో చిన్ననాటి జ్ఞాపకాలు చాలా ఉన్నాయన్నారు. నరసరావుపేట అంటే ముందుగా గుర్తొచ్చేది రాజాగారికోట అంటూ తన చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తల్లి విజయ నిర్మల జ్ఞాపకార్థం పట్టణంలో విగ్రహం ఏర్పాటు చేయాలని ఉందన్నారు.

చీఫ్‌విప్‌గా వచ్చిన జీవీ ఆంజనేయులుకు టిడిపి శ్రేణుల ఘన స్వాగతం

ప్రజాశక్తి - వినుకొండ

ప్రజల మధ్య ఉండి వారికి పని చేస్తేనే పదవులు, గౌరవం, ఆశీర్వాదాలు ఉంటాయని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. చీఫ్‌విప్ హోదాలో వినకొండకు మొదటిగా శనివారం వచ్చిన ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుకు టిడిపి శ్రేణులు ఘన స్వాగతం పలికి భారీ ర్యాలీ నిర్వహించాయి. ఎంపీతోపాటు మాచర్ల, నరసరావుపేట ఎమ్మెల్యేలు జూలకంటి బ్రహ్మారెడ్డి, డాకటర్ చదలవాడ అరవిందబాబు పాల్గొన్నారు. శివయ్య స్థూపం వద్దకు చేరుకున్న ర్యాలీ అనంతరం నేతలు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలేశారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు విషయంలో కంగారు పడాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలనే విషయం గుర్తు పెట్టుకోవాలన్నారు. జీవి ఆంజనేయులు మాట్లాడుతూ వరికపూడిసెల ప్రాజెక్ట్ నిర్మాణానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని, నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చి తాగునీరు సరఫరా చేస్తామని చెప్పారు. ప్రజలు ఏ సమస్యలు ఉన్న తమ దృష్టికి తేవాలన్నారు.

డాక్టర్ కోడెల శివరామకృష్ణ శుభాకాంక్షలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఏపీ అసెంబ్లీలో చీఫ్‌విప్‌గా నియమితులైన వినుకొండ ఎమ్మెల్యే జీవి ఆంజనేయులును గుంటూరులోని ఆయన నివాసంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోడెల శివరామకృష్ణ శనివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ద్వారా బహుముఖ సేవా కార్యక్రమాలు నిర్వహించారని కొనియాడారు.

లోక్ అదాలత్‌పై జడ్జిల సమీక్ష

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : నరసరావుపేట మండల న్యాయ సేవాధికారసంస్థ ఆధ్వర్యంలో వచ్చేనెల 14న నరసరావుపేటలోని న్యాయస్థాన భవనాల ఆవరణలో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని నరసరావుపేట ప్రధాన సీనియర్ సివిల్ న్యాయ అధికారి పూర్ణిమ కోరారు. శనివారం కోర్టు ఆవరణలో వివిధ శాఖల అధికారులు, న్యాయవాదులతో ఆమె సమీక్షించారు. కేసులను పెద్ద సంఖ్యలో రాజీమార్గం ద్వారా పరిష్కరించడానికి కక్షిదారులకు, ఫిర్యాదుదారులకు తగు సూచనలు చేయాలని న్యాయవాదులను, పోలీసు అధికారులను కోరారు. కార్యక్రమంలో మండల న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్, 13వ అదనపు జిల్లా న్యాయ అధికారి ఎన్.సత్యశ్రీ, ప్రధాన జూనియర్ సివిల్ అధికారి ఆర్.ఆశీర్వాదం పాల్, మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయ అధికారి ప్రవళిక పాల్గొన్నారు.

ఖోఖో రాష్ట్రస్థాయి పోటీలు ప్రారంభం

క్రీడాజ్యోతితో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

ప్రజాశక్తి - కారంపూడి

ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 68వ రాష్ట్రస్థాయి అండర్-14 బాల, బాలికల ఖోఖో పోటీలను స్థానిక బ్రహ్మనాయుడు జెడ్‌పి పాఠశాలలో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పోటీలను ప్రారంభించి మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాల్లో క్రీడల మీద ప్రత్యేక చర్చ జరిగిందన్నారు. అన్ని నియోజకవర్గాల్లో, అన్ని మండల కేంద్రాల్లో మినీ స్టేడియంలు ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలు ఉన్నాయని చెప్పారు. దేశానికి కీలకమైన యువతను తీర్చిదిద్దడం ఎంతో అవసరమని, అందుకుగాను విద్యాశాఖలో సమూలమైన మార్పులు తేవాలనేది మంత్రి లోకేష్ ఉద్దేశమని అన్నారు. క్రీడలు మానసిక వికాసం, శారీర దారుఢ్యానికి దోహదం చేస్తాయని, క్రీడాకారులు ఎప్పులూ బలంగా ఉంటారని చెప్పారు. పిల్లలందరూ సెల్ ఫోన్‌ను ఒక గంటైనా పక్కనపెట్టి నచ్చిన క్రీడల్లో భౌతికంగా పాల్గొనాలని సూచించారు. క్రీడాకారులకు గతంలో ఉన్న రెండు శాతం రిజర్వేషన్‌ను మూడు శాతానికి పెంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ-1 శ్రీనివాసరెడ్డి, ఇన్‌ఛార్జి హెచ్‌ఎం రఘుబాబు, విద్యా కమిటీ, అభివృద్ధి కమిటీ చైర్మన్లు బాలునాయక్, మోదిన్స, కూటమి పార్టీల నాయకులు, పిఇటిలు పాల్గొన్నారు.

సైబర్ నేర నియంత్రణపై పోలీసులకు అవగాహన

ప్రజాశక్తి- పల్నాడు జిల్లా : నరసరావుపేటలోని పట్టణం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తెలుగు సైబర్ ఆర్మీ ఫౌండర్, సీఈఓ, సైబర్ క్రైమ్ అడ్వైజర్ ఇన్వెస్టిగేటర్ రామాంజనేయులుతో శనివారం సైబర్ క్రైమ్ గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల దేశవ్యాప్తంగా అధికమవుతున్న సైబర్ క్రైమ్ నేరాల కట్టడికి పోలీసు అధికారులు తీసుకోవాల్సిన చర్యలు, కార్యక్రమ ప్రాధాన్యత గురించి చెప్పారు. సైబర్ క్రైమ్ జరిగినప్పుడు వెంటనే పోలీసు అధికారులు తీసుకోవాల్సిన చర్యలు, నేరాల నిర్మూలనకు ప్రజలను అప్రమత్తం చేయడం వంటి అంశాలపై సిఐలు, ఎస్ఐలు, సిబ్బందికి వివరించారు.

యూటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి -దాచేపల్లి : స్థానిక యూటిఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన మండల సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులు ఎన్.ఏసయ్య, అధ్యక్షులుగా పి.రాజారావు, సహాధ్యక్షులుగా ఎస్‌కె నాగుల్‌మీరా, వివిఎం రత్నకుమారి, ప్రధాన కార్యదర్శిగా టి.ఆనంద్ కుమార్, అదనపు ప్రధాన కార్యదర్శిగా ఎల్.వాసుదేవరావు, కోశాధికారిగా జివి శ్రీనివాసరావు, అదనపు కార్యదర్శిగా యు.సుబ్బలక్ష్మి, మహిళా కార్యదర్శులుగా సిహెచ్ వెంకటరమణ, జి.స్వరూపదేవి, జి.సీత ఎన్నికయ్యారు. వీరితో జిల్లా కార్యదర్శి వి.నాగేశ్వరరావు ప్రతిజ్ఞ చేయించారు. ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం రాజీలేని పోరాటం చేసే యుటిఎఫ్ బలోపేతానికి మరింత కృషి చేయాలన్నారు.

ప్రతిభ చాటిన గన్నవరం విద్యార్థి

ప్రజాశక్తి - విజయపురిసౌత్ : సత్యసాయి విద్యావిహార్ నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గన్నవరం విద్యార్థి కొండేటి సంధ్య ప్రథమ బహుమతి సాధించారు. బహుమతిని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి, కెసిపి ఫ్యాక్టరీ రమణ, సత్యసాయి శ్రీనివాస్ అందించారు. సంధ్యతోపాటు విద్యార్థినికి సహకరించిన ఉపాధ్యాయిని డాక్టర్ సాంబేలు శాంతిబాయిని హెచ్‌ఎం పటాన్ అన్వర్ ఖాన్, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు

కేంద్ర ప్రభుత్వ విధానాలపై 26న కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి- మాచర్ల

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా కలెక్టర్ కార్యాలయం వద్ద 26న జరగనున్న ధర్నాను విజయవంతం చేయాలని సిఐటియు పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు బి.మహేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు పట్టణంలోని కెసిపి సిమెంట్ ఫ్యాక్టరీ వద్ద శనివారం కరపత్రాలను ఆవిష్కరించారు. మహేష్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అమలు చేస్తున్న ప్రజలకు నష్టం చేసే విధానాలనే రాష్ట్రంలోనూ అమలు చేస్తున్నారని విమర్శించారు. సంపదను సృష్టించే కార్మిక వర్గాన్ని, ప్రజలకు తిండిపెట్టే రైతులను విస్మరిస్తూ కార్పొరేట్లుకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాయన్నారు. గత పదేళ్లలో రూ.19.28 లక్షలకోట్లు కార్పొరేట్లకు రుణమాఫీ, పన్ను రాయితీల ద్వారా దోచిపెట్టారన్నారు. విశాఖస్టీల్ ప్లాంట్‌తో సహా భారీపరిశ్రమలు, గనులు, సముద్రతీరాన్ని కారుచౌకగా కార్పొరేట్లకు కట్టబెడుతున్నారన్నారు. కార్మికులకు రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలని, హక్కులను హరించేలా తెచ్చిన లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పంటలకు మద్దతు ధరల చట్టం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వై.సురేష్, వెంకటరత్నం, శోభన్ కుమార్, శ్రీను పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద 26వ జరిగే ధర్నా జయప్రదం కోసం రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పిడుగురాళ్ల పట్టణంలోని ఎస్‌టియు కార్యాలయంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా రైతులు ఢిల్లీలో చేసిన పోరాటం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నేటికీ అమలు చేయలేదన్నారు. వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించే విధానాన్ని వెనక్కు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని, ప్రైవేటీకరణను నిలిపేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో షేక్ హుస్సేన్, టి.శ్రీనివాసరావు, జయకృష్ణ నాయక్, ఎన్.రాంబాబు, కృష్ణ, నాగేశ్వరరావు, హైదర్ ఖాన్, సుజాత పాల్గొన్నారు.

అవినీతి సామ్రాట్ అదానీని అరెస్టు చేయాలి

సిపిఎం ఆధ్వర్యంలో నిరసనలు

ఏపీ ప్రభుత్వం అదానీతో చేసుకున్న ఒప్పందాలన్నింటినీ రద్దు చేయాలని డిమాండ్

ప్రజాశక్తి-తాడేపల్లి

అవినీతి కుంభకోణాలను ప్రోత్సహించిన ఆదానిని వెంటనే అరెస్ట్ చేయాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం ఉండవల్లిలో సిపిఎం రాజధాని డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఆదాని నీ అరెస్టు చేయాలంటూ సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి అధ్యక్షతన నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పాశం రామారావు మాట్లాడుతు దేశంలో సోలార్ విద్యుత్ కాంట్రాక్టర్లు అధికారులకు, రాజకీయ నాయకులకు లంచాలు ఎరచూపి రూ.2029 కోట్లు లంచం ఇచ్చినట్లు కోర్టులు నిర్ధారించాయని దేశవ్యాప్తంగా దీనిపై నిరసన వ్యక్తం అవుతుందని ఇంతజరిగినా దేశ ప్రధాని, రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించకపోవడం అన్యాయమని అన్నారు. గతంలో ఉన్న వైసిపి ప్రభుత్వకాలంలో రూ.1750 కోట్లు ఆనాటి అధికారులకు ప్రజాప్రతినిధులకు ముడుపులు చెల్లించినట్లు తెలుస్తుందని దీనిపై సమగ్ర విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు, సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం భాగ్యరాజు వల్లభాపురం వెంకటేశ్వరరావు డివిజన్ నాయకులు ఈమని రామారావు సిహెచ్ సుందర రావు చేవూరి నంద జి టీ భక్తిరెడ్డి సంకురుఇమ్మానియేల్ రాజు అత్తలూరి వీర వెంకయ్య ఎస్ రామరాజు ఎల్ రాధిక పి గాంధీ, పి రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ఫిరంగిపురం : ఫిరంగిపురం మండల కేంద్రంలో అదాని నీ అరెస్టుచేయాలని నిరసన తెలిపారు. నిరసనలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బైరగాని శ్రీనివాసరావు మాట్లాడారు. ఆదాని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందాలను అన్నిటిని రద్దు చేయాలని, రాష్ట్రంలో ఆదాని గ్రూప్ తో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలన్నీ రద్దు చేయాలని, విశాఖ డేటా సెంటర్ ను రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించాలని, ఆదానికి కేటాయించిన భూములను, ప్రజల సంపదను వెనుక్కు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఫిరంగిపురం మండల కన్వినింగ్ కమిటీ కార్యదర్శి షేక్ మస్తాన్ వలి, నాయకులు వెంకటరెడ్డి, మార్పుల హెూచ్ మేన్, ఆకార పంకమ్మరావు, జి వెంకటేశ్వరరావు సిహెచ్ రామారావ్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదకాకాని : పెదకాకాని శనివారం అవినీతికి పాల్పడిన ఆదానిని అరెస్టు చేయాలని సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య కాలనీలో నిరసన ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం మండల కమిటీ కన్వీనర్ నన్నపనేని శివాజీ మాట్లాడుతూ అదానీ గ్రూపు సంస్థలు ఉత్పత్తి చేసే సౌర విద్యుత్తును వివిధ విద్యుత్ పంపిణీ సంస్థలు కొనుగోలు చేయడానికి ఆ యా రాష్ట్ర ప్రభుత్వ పెద్దలకు అదానీ గ్రూపు భారీగా ముడుపులు చెల్లించిందని అమెరికా కోర్టులో ప్రాసిక్యూటర్లు అభియోగాలు మోపడం పెను సంచలనం

ఉండవల్లిలో నిరసన

పెదకాకానిలో..

ఫిరంగిపురంలో ..

కలిగించిందన్నారు. ప్రతిపక్షంలో ఉండగా వ్యతిరేకించిన తెలుగు దేశం పార్టీ ఇప్పుడు మౌనవ్రతం పాటించడం దారుణం. ఈ రెండు పార్టీలు ఇక్కడ పరస్పరం దూషించుకున్నా కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపినీ పల్లెత్తి మాట్లాడకపోవడం ఈ అంశంలోనూ కొనసాగిస్తున్నారని స్పష్టమవుతోందన్నారు.కార్యక్రమంలో నాయకులు బురదగుంట సాంబయ్య బేతపూడి బాబురావు రేగళ్ల వెంకటేశ్వర్లు జి థామస్ డి లక్ష్మీకాంతమ్మ పి నాగలక్ష్మి డి మల్లేశ్వరి ఆర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు

మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న ఐఎంఎ వైద్యులు

వైద్య రంగంలోనూ తప్పని సవాళ్లు

ఐఎంఎ సదస్సులో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

వైద్య వృత్తి అనేది ప్రస్తుతం ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటుందనీ కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్ర శేఖర్ అన్నారు. వ్యక్తిగత జీవితాన్ని, కుటుంబ జీవితాన్ని త్యాగం చేస్తూ పని చేయగల వృత్తి వైద్య వృత్తి మాత్రమేనని అయన అన్నారు. స్థానిక మెడికల్ కాలేజీలోని ఆడిటోరియంలో శనివారం జరిగిన ఐఎంఏ ఆంధ్రప్రదేశ్ 66వ వార్షిక రాష్ట్ర సమావేశం లో ఆయన విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఐఎంఏ ప్రెసిడెంట్ గా డాక్టర్ గార్లపాటి నందకిషోర్ అధ్యక్షుడుగా ఐఎంఏ సభ్యులు బాధ్యతలు అందజేశారు. సీనియర్ వైద్యులు కొండబోలు బసవ పున్నయ్య, జీవీ కృష్ణారావు, మద్దినేని గోపాలకృష్ణలకు ఐఎంఏ అసోసియేషన్ సభ్యులతో కలిసి పెమ్మసానినీ సత్కరించారు. అనంతరం పెమ్మసాని మాట్లాడుతూ వైద్యుల కోసం అండగా ఐఎంఏ పని చేస్తున్న విధంగానే తాను వంతు నేను కృషి చేస్తానని తెలిపారు. ఐఎంఏ ఆల్ ఇండియా మాజీ ప్రెసిడెంట్ డాక్టర్ జి సమరం, ఐఎంఏ ఏపీ ప్రెసిడెంట్ డాక్టర్ ఎం. జయ చంద్ర నాయుడు, ఐఎంఏ నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆర్. వి అశోకన్(న్యూ ఢిల్లీ), ఐఎంఏ జనరల్ సెక్రటరీ డాక్టర్ అనిల్ కుమార్ జి నాయక్, ఐఎంఏ తెలంగాణ ప్రెసిడెంట్ డాక్టర్ డి ద్వార కానాథ్ రెడ్డి, డాక్టర్ ఎం. జె .సి .నాయుడు తదితరులు పాల్గొన్నారు. వివిధ అంశాలపై అవగాహన సదస్సులు నిర్వహించారు.

శిక్షణలో పాల్గొన్న అధ్యాపకులు

మలినేనిలో ముగిసిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు

పుల్లడిగుంటలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో గత 6రోజులుగా జరుగుతున్న మైక్రో చిప్ ఎంబెడెడ్ డెవలప్మెంట్ ఫ్యాకల్టీ డెవలప్మెంట్ కార్యక్రమ ముగిసింది. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఎఫ్ట్రానిక్స్ సంస్థ సిఇఓ దాసరి రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థలు నుండి పరిశ్రమలు ఎక్కువ నైపుణ్యం కోరుకుంటున్నాయని, కానీ సాంకేతిక కళాశాలలో పాత తరహా భోదన, పాత విద్యాంశాలనే బోధిస్తున్నాయని అన్నారు. దీనివల్ల పరిశ్రమలు ఆశించిన స్థాయికి విద్యార్థుల నైపుణ్యం చేరడం లేదని, కావున ఈతరహా డెవలప్మెంట్ కార్యక్రమాల ద్వారా ఉపాధ్యాయులు నైపుణ్యాన్ని పెంచుకుని విద్యార్థుల నైపుణ్యాలను పెంచాలని కోరారు. కళాశాల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్ళు మాట్లాడుతూ మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్ వంటి ప్రముఖ ఇంజినీరింగ్ విభాగాల్లో అవకాశాలు తగ్గడంతో అందరూ కంప్యూటర్ సైన్స్, సంబంధించిన విభాగంలో ఎక్కువగా అడ్మిషన్ తీసుకుంటున్నారని అన్నారు.కానీ అది భవిష్యత్తుకు మంచిది కాదు అని, అన్ని విభాగాల్లో ఉపాధ్యాయులు నైపుణ్యాన్ని సంపాదించి విద్యార్థులను ఉత్తేజపరిచే విధంగా కషి చేయాలి అని తెలిపారు.కార్యక్రమం కోఆర్డినేటర్, సిఇసి విభాగాధిపతి డాక్టర్ విజయసారథి మాట్లాడుతూ వివిధ ప్రముఖ కళాశాలల నుండి హాజరైన ఉపాధ్యాయులు అందరూ నేర్చుకున్న అంశాలను తమ విద్యార్థులకి చేరవేయాలి అని తెలిపారు. ఎడ్యుస్కిల్స్ నుండి వచ్చిన రిసోర్స్‌పర్సన్ ప్రభుపాద సమల్ మాట్లాడారు. ఈ సందర్భంగా మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో మైక్రో చిప్ ఎంబెడెడ్ సిస్టమ్ ద్వారా విద్యార్థుల నైపుణ్యం పెంచడానికి అత్యాధునిక సౌకర్యాలతో కూడిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ని ప్రారంభించారు.ఈ కార్యక్రమలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జెట్టి అప్పారావు, డైరెక్టర్ డాక్టర్ దేవిరెడ్డి శ్రీనివాసకుమార్, డీన్ జంపని కిషోర్‌బాబు పాల్గొన్నారు.

26న కార్మిక, రైతు గర్జనను జయప్రదం చేయండి

మాట్లాడుతున్న అజయ్ కుమార్

ప్రజాశక్తి-గుంటూరు

అఖిల భారత కార్మిక, రైతు సంఘాల పిలుపు మేరకు 26న గుంటూరులో జరిగే కార్మిక, రైతు గర్జన ప్రదర్శన, సభను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.అజయ్ కోరారు. శనివారం స్థానిక మస్తాన్ దర్గా సెంటర్‌లోని టింబర్ ముఠా కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో పాల్గొని ఆయన ప్రసంగించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలును వివరించారు. ప్రతి ఒక్కరూ ఈ విధానాలను వ్యతిరేకించాలన్నారు. సమావేశంలో సిఐటియు గుంటూరు తూర్పు కమిటీ ప్రధాన కార్యదర్శి ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ అసంఘటితరంగా కార్మికులకు సంక్షేమ చట్టం చేయాలని అన్నారు. మోడీ ప్రభుత్వం కార్మిక సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. దేశ వ్యాప్తంగా జరుగుతున్న ఈ ర్యాలీలలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. సమావేశానికి టింబర్ ముఠామేస్త్రి జిలాని అధ్యక్ష వహించారు. మేస్త్రి వెంకటేశ్వర్లు, హుస్సేన్ వలి, నాగుల మీరా, పీర్‌సాహెబ్ ,హసన్, సైద పాల్గొన్నారు.

ప్రజాశక్తి - చేబ్రోలు

26న గుంటూరు శంకర్ విలాస్ సెంటర్ నుండి జరిగే రైతు కార్మికుల ర్యాలీ, సభను జయప్రదం చేయాలని సి ఐ టి యు పిలుపునిచ్చింది. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ శనివారం పొన్నూరు టౌన్ సిఐటియు ఆఫీస్ లో జి విజయ కుమారి అధ్యక్షతన సమావేశం నిర్వహించ్చారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు దండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ

కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తుందని వాటిని వెంటనే ఆపాలని , విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు.కనీస వేతనం 26,000 ఇవ్వాలని అన్నారు.రైతుల పండించిన పంటకు పెట్టుబడికి 50శాతం కలిపి గిట్టుబాటు ధర ఇవ్వాలన్నారు. స్కీం వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనం అమలు చేయాలని , కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని అన్నారు .సిఐటియు మండల కార్యదర్శి నిమ్మ కురి రమేష్ బాబు మాట్లాడుతూ ర్యాలీకి రైతులు కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజాశక్తి - మంగళగిరి

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 26న గుంటూరులో జరిగే ధర్నాను, ప్రదర్శనను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం సాయంత్రం మంగళగిరి పట్టణంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కరపత్రాలను పంపిణీ చేశారు. 26న జరిగే కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో కార్మికులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఆలంబిస్తున్న విధానాల వలన కార్మికులు ఎన్నో సంవత్సరాలుగా పోరాడి సాధించుకున్న హక్కులను కాలరస్తున్నారని ప్రజా సంఘాల నాయకులు ఈ సందర్భంగా విమర్శించారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరణ అంశంపై మాట్లాడడం లేదని విమర్శించారు. గతంలో ఉన్న వైసీపీ, ప్రస్తుతం అన్న టిడిపి కూటమి ప్రభుత్వాలకు తేడా లేదని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎస్ ఎస్ చంగయ్య, సీనియర్ నాయకులు జెవి రాఘవులు, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి బాలకష్ణ, సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు వై కమలాకర్, ఎం బాలాజీ, ఏఐఎఫ్టీయూ న్యూ నాయకులు కే కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

రైతాంగ సమస్యలు పరిష్కరించాలని 26వ తేదీన జిల్లా కేంద్రంలో జరుగు ధర్నాలు జయప్రదం చేయాలని, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు అన్నారు. శనివారం ఎం.టి.ఎం.సి పరిధిలోని గుండిమెడ గ్రామంలో కరపత్రాల పంపిణీ చేస్తూ, రైతు, కౌలు రైతు సంఘం నాయకులు విస్తృత ప్రచారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా శివ శంకరరావు మాట్లాడుతూ భారత రాజ్యాంగానికి, ప్రజాస్వామ్య వ్యవస్థకు తూట్లు పొడిచే విధంగా పరిపాలన సాగిస్తున్న కేంద్ర బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, సంయుక్తా కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక కేంద్ర ప్రభుత్వం ముందు ఉంచిన అనేక డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ దేశవ్యాప్తంగా 500 జిల్లాలలో పెద్ద ఎత్తున రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు, గ్రామీణ, పట్టణ పేదలు, కార్మికులు, మహిళలు సమీకతమై, ధర్నాలు చేపడుతున్నారని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు దొంతి రెడ్డి వెంకటరెడ్డి, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి బత్తుల సంసోను, తురక సాంబయ్య, యేసు రత్నం, దావీదు తదితరులు పాల్గొన్నారు.

నేడు సిపిఎం తాడేపల్లి పట్టణ మహాసభ

ప్రజాశక్తి-తాడేపల్లి : నిరంతర ఉద్యమ పోరాటలగడ్డపై నేడు సిపిఎం పట్టణ మహాసభను నిర్వహించుకుంటున్నామని పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు తెలిపారు. తాడేపల్లి సిపిఎం పట్టణ ఐదో మహాసభ తాడేపల్లి మేక అమరారెడ్డి భవన్లో జరగనుంది. దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య, సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి పేరు మీద స్వాగత ద్వారం ఏర్పాటు చేశారు. నేడు జరగనున్న మహాసభలో సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, కార్యదర్శి వర్గ సభ్యులు వై నేతాజీ, ఈమని అప్పారావు, ఎం రవి పాల్గొంటారని తెలిపారు.

51 మంది ఎన్‌సిసి క్యాడెట్ల రక్తదానం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఎన్‌సిసి 76వ వారోత్సవాల సందర్భంగా నరసరవుపేట ఇంజినీరింగ్ కళాశాలలో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయగా 51 మంది ఎన్‌సిసి క్యాడెట్లు రక్తదానం చేశారని రెడ్‌క్రాస్ సొసైటీ పల్నాడు జిల్లా చైర్మన్ డాక్టర్ కంజుల జగన్ మోహన్ రెడ్డి శనివారం తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు, రెడ్‌క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ పివిఎం శరత్‌బాబు, కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, కార్యదర్శి మిట్టపల్లి రమేష్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సునీల్, కళాశాల ఎన్‌సిసి అధికారి రాజేష్‌బాబు, మేనేజింగ్ కమిటీ సభ్యులు బత్తుల మురళి, డాక్టర్ రహంతుల్లా, జిల్లా కో-ఆర్డినేటర్ పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయి బాబా జయంతి

ప్రజాశక్తి - విజయపురిసౌత్

సత్యసాయి బాబా 99 జయంతి వేడుకలు విజయపురిసౌత్‌లోని శ్రీ సత్యసాయి ప్రేమ మందిరంలో శనివారం నిర్వహించారు. ఆలయ అర్చకులు హనుమంత చార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజల అనంతరం పల్లకిలో ఊరేగించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి, హిల్ కాలనీ కమలా నెహ్రూ ఆసుపత్రిలో డాక్టర్. గంద్రకోట మహేష్ రోగులకు పండ్లు, బెడ్లు పంపిణీ చేశారు. 1000 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్త కె.శ్రీహరి ప్రసాద్, జానారెడ్డి, వెంకట సుబ్బయ్య, గొంతిన సాయి, రాజేష్, హనుమంతరావు, రామకృష్ణ, శివ, సుధాకర్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి- వెల్దుర్తి

మాచర్ల పట్టణంలోని శ్రీ సత్య సాయి విద్యా విహార్‌లో వేడుకలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ పోలూరు నరసింహారావు, టిడిపి సీనియర్ నాయకులు మద్దిగపు చిన్న వెంకటరామిరెడ్డి హాజరై పాఠశాలలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌ను ప్రారంభించారు. వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కెసిపి సంస్థ జిఎం వెంకటరమణ, సూరే ఎలమంద, కాలంగి నాగేశ్వరరావు, మేడం నాగేశ్వరరావు, లక్ష్మీనారాయణ, సత్య సాయి సేవ సమితి సభ్యులు అక్కినేని అనిల్, జక్క శ్రీనివాసరావు, పాఠశాల హెచ్‌ఎం వై.రమాదేవి పాల్గొన్నారు.

మరుగుదొడ్ల ప్రాధాన్యంపై అవగాహన

ప్రజాశక్తి - కారంపూడి

మరుగుదొడ్ల ప్రాధాన్యంపై మండలంలోని నరమాలపాడు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై పంచాయతీ కార్యదర్శి శివకుమార్ వివరించారు. ప్రతి ఇంట్లో మరుగుదొడ్డి ఉండాలని, లేనివారు స్థానిక సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. స్వచ్ఛభారత్ మండల కో-ఆర్డినేటర్ సుబ్బారావు, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు హనుమాయమ్మ, పాఠశాల సిబ్బంది, ఇంజనీరింగ్ అసిస్టెంట్ శాసల్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో గంటకు 20 మరణాలు

మాచర్లలో ర్యాలీ నిర్వహిస్తున్న శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు

ప్రజాశక్తి- మాచర్ల

రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం మనదేశంలో ప్రతి గంటకు 52 రోడ్డు ప్రమాదాల్లో 20 మంది ప్రాణాలు కోల్పోతున్నారని, దీనికి కారణం నిబంధనలు పాటించకపోవటమేనని శ్రీచైతన్య స్కూల్ ప్రిన్సిపల్ అయ్యపరెడ్డి హరణి అన్నారు. ప్రతి సంవత్సరం నవంబర్ మూడవ ఆదివారం నాడు ప్రపంచంలోని రోడ్డు మార్గాల్లో మరణించిన లేదా తీవ్రంగా గాయపడిన వారిని గుర్తుచేసుకోవడంలో భాగంగా శనివారం పట్టణంలోని శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు రోడ్డు ప్రమాదాల్లో మరణించిన వారికి శ్రద్ధాంజలి ఘటించి, ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపల్ హరణి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో మరణించిన వారిలో 50 శాతం కంటే ఎక్కువ మంది 18-35 ఏళ్లవారేనని, దాదాపు 70 శాతం ప్రమాదాల్లో అతివేగం వల్లే ప్రాణాలు కోల్పోతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయని తెలిపారు. అత్యధికంగా ప్రమాదాల్లో మరణిస్తున్న దేశాల్లో మనదేశమే అగ్రస్థానంలో ఉందని చెప్పారు. ప్రమాదాలు తగ్గించేందుకు చిన్నప్పటి నుంచే అవగాహన, నియంత్రణ ముఖ్యమన్నారు. అతివేగంతో, మద్యం తాగి, సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదని, తప్పని సరిగా హెల్మెట్, సీటు బెల్టు ధరించాలని, పరిమితికి మించి వాహనాల్లో ప్రయాణికులను ఎక్కించుకోరాదని, జీబ్రా లైన్ల మీదుగా రోడ్డు దాటాలని, ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల డీన్ బత్తుల అనీల్‌కుమార్, ఇన్‌ఛార్జి హారిక, టీచర్లు నసీమా, మానస, రాజ్యలక్ష్మి, మహేశ్వరి, పార్వతి, అరుణకుమారి, అపర్ణ పాల్గొన్నారు.

నరసరావుపేటలో ర్యాలీని ప్రారంభిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సేఫ్ ఇండియా, సేఫ్ లైఫ్ కార్యక్రమంలో భాగంగా నరసరావుపేట పట్టణం 60 అడుగుల రోడ్డులోని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై ట్రాఫిక్ ఎస్సై వేణు శనివారం అవగాహన కల్పించారు. నిబంధనలను ఉల్లంఘించడం వల్ల జరిగే పరిణామాలు, తల్లి దండ్రులు పిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇవ్వడం వల్ల జరిగే దుష్ఫలితాలను వివరించారు. అనంతరం విద్యార్థులతో ట్రాఫిక్ అవగాహనపై ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ఎజిఎస్.అంజయ్య, ఆర్ఎ అప్పాజీ, ప్రిన్సిపాల్ నాగూర్ మీరా, కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు, సుబ్బారావు, ఎడి వీరయ్య పాల్గొన్నారు.

ఎఎం రెడ్డి స్మారక ఫార్మసీ కాలేజీలో ముగిసిన వారోత్సవాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట మండలంలోని పెట్లూరివారిపాలెంలో గల ఎఎంరెడ్డి స్మారక ఫార్మసీ కళాశాలలో జాతీయ ఫార్మసీ వారోత్సవాలు శనివారం ముగిశాయి. కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఫార్మసిస్టులు సమాజంలో ఎంతో ప్రముఖ పాత్రపోషిస్తున్నారని, రానున్న రోజుల్లో ఫార్మసీ చదివిన ప్రతిఒక్కరూ ప్రాథమిక ఆరోగ్య విధానాలకు చేరువ కావాల్సిన అవసరం ఉందని అన్నారు. ఔషధ తయారీలో ఔషధాలపై జరుగుతున్న వైజ్ఞానిక అంశాలు మెరుగుపడాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.భార్గవ్ భూషణ్‌రావు మాట్లాడుతూ ప్రపంచ ఫార్మసీ ఫెడరేషన్ ఇచ్చిన థింక్ ఫార్మసీ, థింక్ హెల్త్ అనే అంశంతో ఈ ఏడాది ఫార్మసీ వారోత్సవాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నరసరావుపేట పట్టణంలోని పల్నాడు బస్టాండ్ నుండి వినుకొండ రోడ్డులోని ఆర్టీసీ బస్టాండ్ వరకు విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. మండలంలోని ఉప్పలపాడు, పెట్లూరివారిపాలెం, కాకాని గ్రామాలలో ఔషధాల వినియోగం పట్ల ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. కళాశాలలో నిర్వహించినటువంటి వక్తృత్వ పోటీలు, క్విజ్ పోటీలు, ఎలక్యూషన్ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు.

పన్ను వసూళ్లపై మున్సిపల్ సిబ్బందికి ఆర్‌డి ఆదేశాలు

ప్రజాశక్తి - మాచర్ల

ఆస్తి పన్ను, వాటర్ టాక్స్ ఇతర పన్ను వసూళ్లపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని అధికారులను మున్సిపల్ ఆర్‌డి హరికృష్ణ ఆదేశించారు. శనివారం ఉదయం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వేణుబాబు, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ అడ్మిన్స్, ఎమినిటి సెక్రటరీలతో పన్నుల వసూళ్లపై ఆర్‌డి ప్రత్యేకంగా సమీక్షించారు. రూ.7.40 కోట్ల పన్ను వసూళ్లకు కేవలం 28 శాతం వసూలైనట్లు చెప్పారు. వచ్చేనెల మరోసారి వస్తానని, అప్పటికి 50 శాతం వసూలవ్వాలని ఆదేశించారు. జనవరి, ఫిబ్రవరి నెలఖారుకు 100 శాతం వసూలుకు కృషి చేయాలన్నారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం నుండే ప్రత్యేక డ్రైవ్ ప్రారంభించారు.

ఉన్నతంగా స్థిరపడేలా ఫార్మసీ రంగంలో అవకాశాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

పేద, మధ్య తరగతి విద్యార్థులు తక్కువ కాల వ్యవధిలో తమ కాళ్లపై తాము నిలబడేలా ఫార్మసీ విద్య భరోసానిస్తుందని, ఫార్మసీ రంగంలో ఉన్నతంగా స్థిరపడేందుకు అవకాశాలు మెండుగా ఉన్నాయని చెన్నుపాటి ఇండో అమెరికన్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ చైర్మన్ చెన్నుపాటి సత్యనారాయణ అన్నారు. 63వ జాతీయస్థాయి ఫార్మసీ వారోత్సవాల సందర్భంగా నరసరావుపేట మండలం జొన్నలగడ్డలోని కళాశాలలో విద్యార్థులకు శనివారం వ్యాసరచన, డ్రాయింగ్ తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. వారోత్సవాలు ముగింపు సందర్భంగా జొన్నలగడ్డలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చెన్నుపాటి సురేష్, ఏఓ కె.రమేష్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్లో వాటర్ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి - పెదకూరపాడు

స్థానిక రైల్వేస్టేషన్లో మినరల్ వాటర్ ప్లాంట్‌ను టిడిపి మండల అధ్యక్షులు ఎ.రమేష్ శనివారం ప్రారంభించారు. రమేష్ పుట్టినరోజు సందర్భంగా విశ్రాంత గేట్‌మెన్ ముట్లూరి సుబ్బారావు కుమారుడు శ్రీనివాసరావు (రైల్వే స్టేషన్ మాస్టర్) సొంత నిధులతో ప్రయాణికులకు శుద్ధ జలం అందించేందుకు మినరల్ వాటర్ యూనిట్ ఏర్పాటు చేశారు. స్టేషన్ మాస్టర్ పీవీఎస్ఎస్ రావు, ఎం.సుధీర్, కుమారస్వామి, బి.రాంగోపాలరావు, బాబు, వి.అప్పారావు, మల్లి, బుల్లిబాబు, వి.రాంబాబు, రాములు పాల్గొన్నారు.

నగదు బదిలీ కోసం పోస్టాఫీసులో ఖాతా తెరవండి

ప్రజాశక్తి- మాచర్ల రూరల్ :

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు సంబంధించిన నగదు బదిలీ కోసం పోస్టు ఆఫీసు నందు ఖాతాలు తెరవాలని మున్సిపల్ కమిషనర్ వేణుబాబు శనివారం ఒక ప్రకటనలో కోరారు. పట్టణంలోని మెయిన్ రోడ్డు పోస్ట్ ఆఫీస్‌లో ఈనెల 25,26,27 తేదీల్లో అకౌంట్ ఓపెన్ మెగా డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అకౌంట్ ఓపెన్ చేసిన తర్వాత ఎన్‌పిసిఐ లింకు చేస్తారని, ఎన్‌పిసిఐ లింక్ అయిన వారికి మాత్రమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలకు సంబంధించిన డబ్బులు జమ అవుతాయని పేర్కొన్నారు. ఎకౌంట్ ఓపెన్ చేసే వారు ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్, రూ.200 నగదు తీసుకొని రావాలని సూచించారు.

ఓటు నమోదుకు ప్రత్యేక డ్రైవ్

ప్రజాశక్తి - మాచర్ల

జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటు నమోదుకు అర్హత ఉంటుందని మున్సిపల్ కమిషనర్ వేణుబాబు అన్నారు. ఆయన శనివారం తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ ఓటు నమోదుకు ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో శనివారం, ఆదివారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణ పరిధిలో అర్హత ఉన్న వారు ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. తొలగింపు, సవరణ కోసం దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

విద్యార్థులకు జామెంట్రీ బాక్సులు పంపిణి

ప్రజాశక్తి - దాచేపల్లి

మండలంలోని పెద్ద గార్లపాడు ప్రభుత్వ పాఠశాల పదో విద్యార్థులకు జామెంట్రీ బాక్సులు, పెన్నులు, పరీక్ష అట్ట,పెన్సిల్స్‌ను ఎంఎన్‌వి ఫౌండేషన్ సమకూర్చగా వీటిని సర్పంచ్ కర్పూరపు వెంకట కోటయ్య ద్వారా శనివారం పంపిణీ చేశారు. ట్రస్ట్ డైరెక్టర్ మామిళ్ళ నవీన్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి 7
గుంటూరు జిల్లా
ఆదివారం 24 నవంబర్ 2024

ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు

ప్రజాశక్తి - మంగళగిరి

నియోజకవర్గం పరిధిలో అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద రెండు రోజులపాటు జరిగే ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులకు సంబంధించిన ప్రక్రియ శనివారం ప్రారంభించారు. స్థానిక సీకే గర్ల్స్ హైస్కూల్లో పోలింగ్ కేంద్రం163 నుండి 169 వరకు బూత్ లెవెల్ అధికారులు ముసాయిదా ఫోటో ఓటర్ల జాబితా- 2025 అందుబాటులో ఉంచి జాబితాలో మార్పులు, చేర్పులు ప్రక్రియ నిర్వహించారు. ఓటర్ కార్డులోని మార్పులు, చేర్పులు, కొత్త ఓటు నమోదు, మరణించిన వారి ఓట్లు తొలగించుకోవడం వంటివి సరి చేసు కుంటున్నారు. ఓటర్లు సంబంధిత ఫారంను పూర్తిచేసి క్లెయిమ్ కు సంబంధించిన పత్రాలు జత చేసి బిఎల్ఒలకు సమర్పించారు.ఈ కార్యక్రమంలో బిఎల్వోలు పీ భాస్కరరావు, మణికంత, కె నాగమణి, భవ్య, సమత, ధరణి, డి చంద్రిక పాల్గొన్నారు.

37 మంది రాజధాని రైతులకు ప్లాట్లు పంపిణీ

ప్రజాశక్తి - తుళ్లూరు

ల్యాండ్ పూలింగ్‌లో భూములిచ్చిన 37 మంది రాజధాని రైతులకు రిటర్నబుల్ ప్లాట్లను అధికారులు పంపిణీ చేశారు. శనివారం విజయవాడలోని సి ఆర్ డి ఎ కార్యాలయంలో ఈ - లాటరీకి హాజరైన రైతులకు అదనపు కమిషనర్ మల్లారపు నవీన్ నేతృత్వంలో ఆన్ లైన్ ర్యాండం సిస్టం ద్వారా నివాస, వాణిజ్య ప్లాట్లను కేటాయించారు. రాజధాని పరిధిలోని కృష్ణాయపాలెం, నవులూరు - 1,2 బోరుపాలెం, నెక్కల్లు, తుళ్లూరు - 1, 2 వెలగపూడి, మందడం - 1, 2 నిడమర్రు - 1, 2 అనంతవరం గ్రామాలకు సంబంధించి 37 మంది రైతులకు 120 నివాస, 49 వాణిజ్య ప్లాట్లకు సంబంధించిన పత్రాలను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా సి ఆర్ డి ఎ అదనపు కమిషనర్ నవీన్ మాట్లాడుతూ గతంలో రిటర్నబుల్ ప్లాట్లు అందుకోని రైతులకు ఈ - లాటరీ విధానంలో ప్లాట్లు కేటాయించడం జరుగుతోందన్నారు. అమరావతిలో తొమ్మిది రిజిస్ట్రేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, లాటరీలో ప్లాట్లు పొంది ప్రొవిజినల్ సర్టిఫికెట్లు అందుకున్న వారం రోజుల లోపు సంబంధిత రిజిస్ట్రేషన్ కేంద్రాలకు వెళ్లి రైతులు రిజిస్ట్రేషన్ పూర్తిచేసుకోవాలని కోరారు. ఈ - లాటరీలో ప్లాట్లు పొందిన రైతులకు భౌగోళికంగా వారి ప్లాట్లు ఎక్కడ కేటాయించబడ్డాయో వివరించడానికి ప్రత్యేకంగా జిఐఎస్ సిబ్బంది, గ్రామ సర్వేయర్లను నియమిం చామని చెప్పారు. కార్యక్రమంలో సి ఆర్ డి ఎ ల్యాండ్స్ డైరెక్టర్ బి ఎల్ ఎన్ రాజకుమారి,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వి డేవిడ్ రాజు, జి భీమారావు,పద్మావతి, రవీంద్ర,గుంటూరు కలెక్టరేట్ ఎస్డీసీ లక్ష్మీకుమారి, తహశీల్దార్ అరుణాదేవి పాల్గొన్నారు.



రైతులకు పత్రాలను అందజేస్తున్న సి ఆర్ డి ఎ అదనపు కమిషనర్ ఎం నవీన్

మహిళా పోలీసుల సమస్యలు పరిష్కరించాలి

టిటిడి బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకిదేవికి వినతి

ప్రజాశక్తి-మంగళగిరి

ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు మహిళా పోలీస్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం టిటిడి బోర్డు సభ్యురాలు, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకి దేవిని కలిసి అభినందనలు తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షు రాలు మధులత, కమిటీ సభ్యులు మాట్లాడుతు మహిళ పోలీ సులు అనేక ఇబ్బందులు పడుతున్నారని మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకురావాలని కోరారు. జానకి దేవి స్పందించి మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకు వెళ్తానని, త్వరలోనే మహిళా పోలీ సుల సమస్యను పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసు కుంటుందని తెలిపారు. అనంతరం జానకి దేవిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఏ రాధిక, స్టేట్ అడిషనల్ సెక్రటరీ గీతా పావని, రేఖ పాల్గొన్నారు.

సోషల్ మీడియా కార్యకర్తలకు అండగా ఉంటాం

ప్రజాశక్తి - మంగళగిరి

వైసిపి సోషల్ మీడియా కార్యకర్తలకు అండగా ఉంటానని మంగళగిరి నియోజకవర్గం వైఎస్ఆర్సిపి సమన్వయకర్త దొంతి రెడ్డి వేమారెడ్డి అన్నారు. బైపాస్ రోడ్డు లోని నియోజకవర్గ కార్యాలయంలో వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని అండగా జగన్, తాను ఉన్నానని అన్నారు. వైసీపీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. సమావేశంలో వైఎస్ఆర్సిపి సోషల్ మీడియా గుంటూరు జిల్లా కన్వీనర్, మంగళగిరి నియోజకవర్గ కోకన్వీనర్స్ పాల్గొన్నారు.

దీక్షలకు కాంగ్రెస్‌పార్టీ మద్దతు

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశ క్తి -తాడేపల్లి

ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు అండగా అవసరమైతే రాష్ట్ర పిసిసి అధ్యక్షులు వైయస్ షర్మిలమ్మను దీక్ష శిబిరం వద్దకు రప్పించి పోరాటానికి అండదండలు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్కే సలీం, దర్శనపు సామేలు తెలిపారు. న్యాయమైన కార్మికుల సమస్యను ప్రభుత్వం జోక్యం చేసుకొని పరిష్కరించాలని సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కోర్టు తీర్పులు అనుకూలంగా తీర్పు ఇచ్చిన యాజమాన్యం పరిష్కారానికి ముందుకు రాకపోవడం పట్ల అసంత ప్తి వ్యక్తం చేశారు. గత ఎన్నికలకు ముందు మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు సమస్య పరిష్కారం చేసి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పటాన్ సుభాని, కె కృష్ణ చౌదరి, కార్మికులు కూరపాటి స్టీవెన్, ఏ వెంకటస్వామి, బి సమర్పణ రావు, జి అర్జున్ రావు, ఎస్ కే ఝూన్సీ, దుర్గ భవాని, నాగేశ్వరరావు, సుభాని, ఇజ్రాయిల్, ఎం ఆశీర్వాదం, బి అంకయ్య, ఎస్ కే భాష, సుబ్బారావు, రమాదేవి, నవనీ తం , శారద, సారమ్మ, సామ్రాజ్యం, యెహెూషు వ, సాంబయ్య, సూర్య ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలు సుగుణమ్మ మృతి

ప్రజాశక్తి - తాడికొండ

శతాధిక వృద్ధురాలు కర్రీ సుగుణమ్మ (104) కంతేరు గ్రామంలోని తన నివాసంలో శనివారం మృతి చెందారు. వృద్ధాప్యంలో కూడా సుగుణమ్మ తన పను లు తానే చేసు కుంటూ ఒకరిపై ఆధార పడకుండా జీవించి అందరికీ ఆద ర్శంగా నిలిచిందని స్థానికులు తెలిపారు. పెద్దకుమారుడు నాగేశ్వరరావు, మను మడు మహేష్ సర్పంచులుగా గ్రామానికి సేవలందించారు. సుగుణమ్మకు గ్రామస్తులు నివాళులు అర్పించారు.

మాదిగలకు తగిన గుర్తింపు ఇవ్వండి

ప్రజాశక్తి - దుగ్గిరాల : మాదిగలకు తగిన గుర్తింపు ఇవ్వాలని తెలుగుదేశం పార్టీ మాదిగలు కోరారు. కార్తీక మాసం సందర్భంగా మండలంలోని కంఠంరాజు కొండూరు శివారులోని సపోటా తోటలో శనివారం టిడిపి మాదిగల వన సమారాధనలో వారు మాట్లాడారు. మాదిగలకు స్మశాన స్థలం కేటాయించాలని మౌలిక సదుపాయాలను కల్పించి పార్టీలో పదవుల్లో తగిన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో చిలువురు సర్పంచ్ చిలువూరు మాణిక్యం, ఎంపిటిసి చిలువూరు మరియమ్మ, ఈమని సర్పంచ్ సిద్దెల శ్రీవాణి ఉజ్వల హరిణి పెద్ద కొండూరు మాజీ సర్పంచ్ కుంపటి వెంకటరత్నం మార్కెటింగ్ యార్డ్ మాజీ చైర్మన్ కొండూరు ముత్తయ్య,వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నిర్మాణాల తొలగింపులను పర్యవేక్షిస్తున్న ఛైర్పర్సన్ రాధిక

మున్సిపల్ పరిధిలో ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెనాలి పురపాలక సంఘ పరిధిలో అభివృద్దే మున్సిపాలిటి ప్రధాన లక్ష్యమని తెనాలి మున్సిపల్ ఛైర్పర్సన్ తాడిబోయిన రాధిక అన్నారు. పట్టణ పరిశుభ్రతలో భాగంగా శనివారం స్థానిక 19వ వార్డులో పారిశుధ్య పనులను పరిశీలించారు. శానిటేషన్ సిబ్బందికి తగిన సూచనలు చేశారు. 17వ వార్డులో మున్సిపల్ అనుమతులేని అక్రమ నిర్మాణాలను సిబ్బందితో కలసి తొలగించారు. మున్సిపల్ అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై శాఖపరమైన శిక్షలు తప్పవన్నారు. పట్టణ సుందరీకరణలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి చేశారు. పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి, ఎంహెచ్ఓ హెలెన్ నిర్మల, ఇంచార్జి ఎఈ కళ్యాణ్ చక్రవర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

మట్టిని అక్రమంగా తరలిస్తే చర్యలు

మంగళగిరి రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి మండల గ్రామీణ పరిధిలోని నవులూరు, ఎర్రబాలెం, బేతపూడి, గ్రామాలలో అక్రమ మట్టి తవ్వకాలు జరిపితే కేసు నమోదు చేసి చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ ఎస్సై సిహెచ్ వెంకట్ హెచ్చరించారు. నవులూరు గ్రామ శివారులో మట్టి అక్రమ రవాణా జరుగుతుందని సమాచారం మేరకు జెసిబి, ట్రాక్టర్ తో పాటు ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచామని తెలిపారు. గ్రామాలలో ముఠాలుగా ఏర్పడి మట్టితవ్వకాలు జరిపిన వారిపై ఇప్పటికే చట్ట ప్రకారం చర్యలు తీసుకున్నామని, ఇలా ముఠాలుగా ఏర్పడి మట్టి తవ్వకాలు జరిపి తరలిస్తే కేసులు నమోదు చేసి జైలకు తరలిస్తామన్నారు. రెవెన్యూ, మైనింగ్ శాఖ అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు చేయడానికి అనుమతి లేదన్నారు. మండల రూరల్ పరిధిలోని ప్రజలు ఎటువంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడరాదని, అలా పాల్పడిన యెడల వారిపై చట్ట ప్రకారం చర్యలుంటాయని ఎస్సై వెంకట్ హెచ్చరించారు.

ఆళ్లకు గద్దర్ జాతీయ సాహితీ సేవా పురస్కారం

12న ప్రదానం చేయనున్న నిర్వాహకులు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెనాలికి చెందిన ప్రముఖ రచయిత, ఆర్టిసి కండక్టర్ ఆళ్ల నాగేశ్వరరావుకు గద్దర్ జాతీయ సాహితి సేవా పురస్కారం 2024 లభించింది. తూర్పుగోదావరి జిల్లా పి గన్నవరం ప్రాంతానికి చెందిన మమతా స్వచ్ఛంద సేవా సమితి ఆధ్వర్యంలో డిసెంబర్ 12న మానవ హక్కుల దినోత్సవం పురస్కరించుకొని ఈ అవార్డు ప్రధానం చేయనున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కోరుకొండ జాన్ వాట్సాప్ వర్తమానం ద్వారా తెలిపారు.

కాజలో యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

వీధి కుక్కల బెడద నగర పరిధిలో ఎక్కువగా ఉన్న కారణం చేత ప్రజల భద్రతా నేపథ్యంలో యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ని ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ పేర్కొన్నారు. నగర పాలక సంస్థ పరిధిలోని కాజ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన వీధి కుక్కల నియంత్రణ సెంటర్‌ను కమిషనర్ అలీమ్ బాషా, పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్యతో కలిసి ఆమె శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పంచుమర్తి అనురాధ మాట్లాడుతూ నియోజకవర్గంలోని వీధి కుక్కల బెడదనియంత్రణ దృష్ట్యా ఎంటిఎంసి పరిధిలోని కాజ గ్రామంలో యానిమల్ వెల్ఫేర్ సోసైటీ వారి ద్వారా రూ 30 లక్షల వ్యయంతో యానిమల్ బర్త్ కంట్రోల్ యూనిట్‌ను ఏర్పాటు చేసినట్లు ఆమె వెల్లడించారు. నియోజకవర్గ వ్యాప్తంగా 6750 వీధి కుక్కలు ఉన్నట్లు అంచనా వేశామన్నారు. వాటిని పట్టుకొని సెంటర్‌కు తరలించి ఆపరేషన్లు చేసిన తర్వాత తిరిగి అదే ప్రాంతంలో విడిచిపెట్టడం జరుగుతుందని చెప్పారు. నగర పాలక సంస్థ కమిషనర్ షేక్ అలీమ్ బాషా మాట్లాడుతూ ఇద్దరు వెటర్నరీ డాక్టర్లను, కుక్కలను పట్టడానికి 10 మంది వ్యక్తులను నియమించినట్లు చెప్పారు. బర్త్ సెంటర్‌లో 108 కుక్కలు ఉండేలా ఏర్పాట్లు చేయగా, ప్రతి రోజు 27 కుక్కలకు ఆపరేషన్లు చేయడం జరుగుతుందన్నారు.

రైతులను అభినందిస్తున్న కంపెనీ జోనల్ మేనేజర్ తదితరులు

అకిరా బిజి-2 ప్రత్తి క్షేత్రప్రదర్శన

ప్రజాశక్తి-గుంటూరు

అమరావతి గ్రామంలోని విన్నకోట రాజా పొలంలో అకిరా క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనకు అమరావతి, పెదకూరపాడు మండలాల్లోని 25 గ్రామాలనుండి 500 మంది రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కంపెనీ జోనల్ మేనేజర్ షేక్.మౌలానా రఫీ మాట్లాడుతూ ఈ రకం ప్రతికూల పరిస్థితులు తట్టుకుని, గులాబీ రంగు పురుగుని సమర్ధవంతంగా ఎదుర్కొని అత్యధిక దిగుబడిని ఇస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక డిస్ట్రిబ్యూటర్స్ మద్దిబాబు, కేశవ తులసి సీడ్స్ డిప్యూటీ రీజనల్ మేనేజర్ వి.చంద్రశేఖర్ కంపెనీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూ యజమానులకు రీ సర్వే పథకం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

రెవెన్యూ శాఖ జారీ చేసిన జీవో నెంబర్ 190 ప్రకారం భూ యజమానులకు నవంబర్ 26 నుంచి ఎపి రి-సర్వే పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు తెనాలి మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న శనివారం ప్రకటన ద్వారా తెలిపారు. సచివాలయ సిబ్బంది ద్వారా ముందుగానే భూ యజమానులకు రీ సర్వే నిర్వహించే సమయాన్ని ఫారం 14 నోటీసు ద్వారా తెలియ పరుస్తామన్నారు. భవన, ఖాళీ స్థలం, వ్యవసాయం, వ్యవసాయేతర స్థలాల యజమానులు కొలతల నిర్వహణకు వచ్చిన సర్వే సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రీసర్వే పూర్తయిన అనంతరం తమ ఆస్తికు సం బంధించిన భూ హక్కు పత్రాలను అందజేస్తామని పేర్కొన్నారు.

వెంకటేశ్వర్లు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

పంచాయతీ కార్మికుడు వెంకటేశ్వర్లు కన్నుమూత

ప్రజాశక్తి - కొల్లిపర : కొల్లిపర గ్రామపంచాయతీ కార్మికుడు కేసన వెంకటేశ్వర్లు(58) అనారోగ్యంతో శుక్రవారం మరణించాడు. శనివారం అంత్యక్రియల సందర్భంగా గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి చింతల శ్రీనివాసరావు, సిపిఎం నాయకులు ములక శివ సాంబిరెడ్డి సిఐటియు మండల కార్యదర్శి కోటా చంద్రశేఖర్ తదితరులు వెంకటేశ్వర్లు భౌతికకాయాంపై సిపిఎం జండా ఉంచి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఉపసర్పంచ్ అవుతు కృష్ణారెడ్డి నివాళులర్పించి మట్టిఖర్చుల నిమిత్తం రూ.15వేలు కుటుంబ సభ్యులకు అందజేవారు. వైసిపి నాయకులు పిల్లి గంగాధర్ గ్రామపంచాయతీ కార్మిక సంఘం మండల కార్యదర్శి మల్లోల రమేష్, యూనియన్ నాయకులు కొల్లిపర కోటేశ్వరరావు యేసు రత్నం పూర్ణచంద్రరావు, గోదా ఏసు పాదం నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.

రోబోటిక్, ఎఐతో కొత్తపుంతలు

సీనియర్ జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్ డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి

ప్రజాశక్తి గుంటూరు

రానున్న రోజుల్లో రోబోటిక్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌తో వైద్యరంగం కొత్త పుంతలు తొక్కనుందని ప్రముఖ జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్, సాయి భాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి పేర్కొన్నారు. యువ వైద్యులు వైద్యరంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులపై ఎప్పటికప్పుడు దృష్టి సారించాలని సూచించారు. రెండు రోజులుగా స్థానిక జింఖానా ఆడిటోరియంలో జరుగుతున్న ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర సదస్సులో శనివారం కీళ్ళ మార్పిడిలో రోబోటిక్ పాత్ర అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రెండు సంవత్సరాల క్రితం వరకు వైద్యరంగంలో రోబోటిక్, ఏఐల పాత్ర అంతంత మాత్రమేనని.. ప్రస్తుతం ప్రతి విభాగము లోనూ తమ ముద్ర వేస్తున్నాయి అన్నారు. ఒక్క కీళ్ల మార్పిడి అంశంలోనే దేశవ్యాప్తంగా 12 వేల రోబోటిక్స్ వున్నాయన్నారు. సాంకేతికత వినియోగం పెరిగేకొద్దీ పేదలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందని డాక్టర్ నరేంద్రరెడ్డి పేర్కొన్నారు.

మన రాజ్యాంగం మహోన్నతమైనది

విజ్ఞాన్స్ సదస్సులో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రామకృష్ణ ప్రసాద్

ప్రజాశక్తి-గుంటూరు

మాట్లాడుతున్న జస్టిస్ రామకృష్ణప్రసాద్

ప్రపంచ దేశాలలోని రాజ్యాంగాలలో మనదేశ రాజ్యాంగం మహోన్నతమైనదని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.రామక్రిష్ణప్రసాద్ అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని ప్రత్యేక అతిథి ఉపన్యాసకార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జస్టిస్ జి.రామక్రిష్ణప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు న్యాయశాస్త్ర విద్యార్థులు బాధితులందరికీ న్యాయం దక్కేలా కషి చేయాలన్నారు. న్యాయశాస్త్ర విద్యార్థులు ప్రతిరోజూ కొత్త విషయాలను, సరికొత్త టెక్నాలజీలను నేర్చుకోవడానికి సిద్ధంగా ఉండాలన్నారు.భారతపౌరులు స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను కాపాడటానికి రాజ్యాంగంలో సమానత్వపు హక్కు, వ్యక్తి స్వేచ్ఛ స్వాతంత్రపు హక్కు, దోపిడీను నిరోధించే హక్కు, మత స్వాతంత్ర్యపు హక్కు, విద్య, సాంస్కృతిక హక్కులను రాజ్యాంగంలో పొందుపరచి, వీటి పరిరక్షణ బాధ్యతలను న్యాయస్థానాలకు అప్పగించిందన్నారు. సమాజంలోని ప్రతి సమస్యను పరిష్కరించేది లాయరేనని పేర్కొన్నారు. న్యాయ విద్యార్థులు ప్రతిరోజూ సమకాలీన పరిణామాలను గమనిస్తూ ఉండాలన్నారు. న్యాయవాద వత్తి సవాళ్లతో కూడుకున్నదని, ఇందులో రాణించాలనుకునే విద్యార్థులు పుస్తకాలు, జర్నల్స్‌బాగా చదవాలన్నారు. ప్రస్తుతం డిజిటలైజేషన్, సైబర్ నేరాలు పెరుగుతున్నందు వలన ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్ వంటి కొత్త టెక్నాలజీలపై పట్టు సాధించాలన్నారు. విజ్ఞాన్స్ చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ వ్యవసాయం, పరిశ్రమలు, హోటళ్లు, క్రీడలు, వినోద రంగాల్లో ప్రైవేటీకరణ పెరుగుతుందని, ఆయా రంగాల్లో కంపెనీలకు న్యాయశాస్త్రం విద్యార్థులకు డిమాండ్ ఏర్పడిందన్నారు. ఈ సందర్భంగా రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన పలు కార్యక్రమాల్లో సత్తాచాటిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను, నగదు బహుమతులను అందజేశారు.కార్యక్రమంలో విజ్ఞాన్ వీసీ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ తదితరులు పాల్గొన్నారు.

బహుమతులు అందుకున్న విద్యార్థులతో ప్రిన్సిపాల్, తదితరులు

స్మార్ట్ డెలివరీ సిస్టమ్స్‌తో రోగులకు మెరుగైన చికిత్స

ప్రజాశక్తి-గుంటూరు

లాంలోని చలపతి ఫార్మసీ కాలేజీలో 'బ్రేకింగ్ జూనియర్స్ నావెల్ అప్రోచెస్ ఇన్ డ్రగ్ డెలివరీ సిస్టమ్స్' అనే అంశంపై జాతీయస్థాయి ఇ-పోస్టర్ పోటీలను శనివారం కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ జువాలజీ, ఆక్వాకల్చర్ విభాగం ప్రొఫెసర్ పి.పద్మావతి, హైదరాబాద్ ఎఐటి ల్యాబ్స్ జనరల్ మేనేజర్ డాక్టర్ ఎం.సంతోష్ కుమార్ హాజరై ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రొఫెసర్ పి.పద్మావతి మాట్లాడుతూ ఆధునిక ఆరోగ్య సంరక్షణ రంగంలో వ్యాధుల చికిత్సకు ఉపయోగపడే ఔషధాలు, టీకాలు, జన్యు చికిత్సలను నిర్దేశిత ప్రాంతాలకు చేరవేయడం సవాలుగా మారిన ప్రక్రియ అయిన, అయితే స్మార్ట్ డెలివరీ సొల్యూషన్లు ముఖ్యంగా ప్రతిస్పందన శీల వ్యవస్థలు ఈ సమస్యలకు సమగ్ర పరిష్కారాలను అందించాయన్నారు. స్మార్ట్ డెలివరీ సిస్టమ్స్ అధునాతన సాంకేతికతతో శారీరక వాతావరణం మార్పులకు ప్రతిస్పందిస్తూ లక్ష్య ప్రాంతాలకు ఔషధాలను సరిగ్గా చేరుస్తాయన్నారు. డాక్టర్ ఎం.సంతోష్‌కుమార్ మాట్లాడుతూ స్మార్ట్ డెలివరీ సిస్టమ్స్ రోగులకు నాణ్యమైన చికిత్స అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ఔషధాలను అత్యుత్తమంగా రూపొందించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ ఉపయోగిస్తారని, అంతేకాకుండా స్మార్ట్ డెలివరీ సొల్యూషన్లు ఆరోగ్య సంరక్షణ రంగంలో ఒక విప్లవాత్మక మార్గమని పేర్కొన్నారు. ఈ పోటీలకు 20 కళాశాలల నుండి 244 ఇ - పోస్టర్లను ప్రదర్శించినట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు తెలిపారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు నగదు బహుమతిని అందజేశారు. విజేతలకు కళాశాల చైర్మన్ వై.వి ఆంజనేయులు అభినందనలు తెలిపారు.

విజయవాడ ఎంబివికెలో నేడు వక్ఫ్ బచావో రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి -గుంటూరు

సదస్సు పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, ఆవాజ్ నాయకులు చిష్టి తదితరులు

కేంద్ర ప్రభుత్వం రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశ పెట్టనున్న వక్ఫ్ చట్ట సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ వక్ఫ్ బచావో పేరుతో నేడు విజయవాడ, రాఘవయ్య పార్క్ వద్ద మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఎమ్మెల్సీ కెయస్ లక్ష్మణరావు కోరారు. శనివారం స్థానిక బ్రాడీపేటలోని ఆవాజ్ కార్యాలయంలో సంఘ నాయకులతో కలిసి సదస్సు పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ రాజ్యాంగం మైనార్టీలకు అనేక హక్కులు కల్పించిందని, ఆర్టికల్ 29, 30 ప్రకారం మైనార్టీలు వారి సంస్కృతి, భాష, ఆస్తులు పరిరక్షణకు, అభివృద్ధికి అవకాశం కల్పించిందని తెలిపారు. వక్ఫ్ ఆస్తుల ద్వారా ముస్లిం అభివృద్ధికి చర్యలు తీసుకోవచ్చన్నారు. వక్ఫ్‌చట్ట సవరణ వల్ల వక్ఫ్ ఆస్తులపై కేంద్రం పెత్తనం పెరుగుతుందని, మైనార్టీలు హక్కులు కోల్పోతారని తెలిపారు. కావున ఈ చట్ట సవరణకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. అవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ చిష్టీ మాట్లాడుతూ వక్ఫ్ స్వయం ప్రతిపత్తిని, ముస్లింల హక్కులను హరించే విధంగా చట్టసవరణ ఉందన్నారు. ఇప్పటిదాకా మైనార్టీలపై భౌతిక దాడులు జరిగాయానని, ఇప్పుడు ఆర్థిక మూలాలపై దాడి జరుగుతుందని అన్నారు. కావున ముస్లింలు, లౌకికవాదులులు అందరూ చట్ట సవరణను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. సదస్సులో కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల, సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శులు వి. శ్రీనివాసరావు, కె.రామకృష్ణ, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు పాల్గొంటారని తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణలో అవాజ్ జిల్లా అధ్యక్షులు ఎస్.కె.భాషా, నాయకులు ఖాసీంవలి, సైదా, ముస్లిం ఐక్య వేదిక నాయకులు అబ్దుల్ కలాం పాల్గొన్నారు.

సంక్షోభంలో రైతాంగం

వీక్షణం

ఉమ్మడి గుంటూరు జిల్లాలో రైతులు తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్నారు. ప్రధాన పంటలు సాగు చేస్తున్న రైతులంతా ఏదో రూపంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా వరి, పత్తి, మిరప, పొగాకు రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. గత ఆగస్టు 31 కురిసిన అతి భారీ వర్షాలతో రైతులు తీవ్రంగా నష్ట పోయారు. అయితే నిబంధనల ప్రకారం తక్కువ నష్టం జరిగిందని కొంత మందికి పరిహారం దక్కలేదు. ప్రధానంగా అధిక వర్షాలతో వరి దిగుబడి తగ్గుతుంది. దీంతో రైతులకి నష్టం వాటిల్లుతుంది. ప్రస్తుతము వరి కోత లు ప్రారంభం అయ్యాయి. ధాన్యం కొనుగోలు చేయడానికి కేంద్రాలు పూర్తి స్థాయిలో ప్రారంభం కాలేదు. పత్తి , మిరప పంటలపై వ్యాపించే తెల్లనల్లి - నల్లనల్లి గురించి రైతులు నష్ట పోతున్నారు. దీనికి నివారణ చేపట్టే దిశగా ప్రభుత్వం ఇంత వరకూ శాశ్వత పరిష్కారం కనుగొనలేక పోయింది. ప్రైవేట్ సంస్థలు తెగుళ్ల నివారణకి మందుని కనిపెట్టినట్లు వేలాది రూపాయలకి మందులు అమ్ముతున్నారు. రైతులు కూడా తప్పక అది కొని వాడుతున్నారు. ఫలితం చాలా తక్కువ గానే ఉంటుంది. శాస్త్రవేత్తలు శాశ్వత పరిష్కారం చూపలేక పోతున్నారు. అష్ట కష్టాలు పడి పండించిన పత్తి పంటను అమ్ముకోవడానికి రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. పత్తి కొనుగోళ్లలో రైతులకు తీవ్ర నష్టం జరుగుతోంది. తేమ శాతం 12కి మించి ఉండకూడదని ఆంక్షలు విధించారు. దీంతో రైతులు తీవ్రంగా నష్ట పోయారు. పత్తి కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యం పై గ్రామీణ అభివృద్ధి కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కూడా కేంద్ర సీసీఐ అధికారులకి ఫిర్యాదు చేశారు. అయినా రైతులకి పూర్తి స్థాయిలో ఆశించిన ఫలితం దక్కలేదు. దిగుబడులు మార్కెట్లోకి వచ్చేవరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకుండా తీవ్ర జాప్యం చేశారు. ఇళ్లలో నిల్వ చేసుకునే అవకాశం లేక రైతులు అయిన కాడికి అమ్ముకున్నారు. గ్రామాలలో ఉన్న మార్కెట్ యార్డుల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకుండా మొక్కుబడిగా గుంటూరు, చిలకలూరిపేట, సత్తెనపల్లి ప్రాంతాల్లో కొన్ని జిన్నింగ్ మిల్లులలో కేంద్రాలు ఏర్పాటు చేశారు. కొనుగోలు కేంద్రాలుగా గుర్తించిన పలు మిల్లు యాజమాన్యాలపై సీసీఐ అధికారులు నెపం మోపుతూ తప్పించుకునే ప్రయత్నాలు చేశారు కొనుగోలు కేంద్రాలుగా గుర్తించడానికి ముందే తగు చర్యలను తీసుకోవలసిన అధికారులు ఇప్పుడు సాకులు వెతుకుతూ జిల్లాలోని పలువురు యాజమాన్యాలను బాధ్యులను చేసే ప్రయత్నం జరుగుతోందని తెలుస్తోంది. మందకొడిగా సాగుతున్న పత్తి కొనుగోళ్లలో వేగవంతం చేయడానికి కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్ర శేఖర్ చేసిన ప్రయత్నం కొంత మేరకు ఫలితం వచ్చినా పూర్తి స్థాయిలో రైతులకి మేలు జరగడం లేదు. అలాగే ఈ యేడాది పత్తి పండించే రైతులు ఈసారి పొగాకు సాగుకు ఆసక్తి కనబరుస్తున్నారు. అయితే పొగాకు సాగు భారీగా పెరిగితే భవిష్యత్ లో ఇబ్బందులు వచ్చే అవకాశం లేకపోలేదనీ రైతు నాయకులు అంటున్నారు. ఈ విషయంలో అధికారులు ముందుగా మేల్కొని ఎంత డిమాండు ఉంది? ఎగుమతులు ఎంత జరుగుతాయి? ఇక్కడ ఉన్న అవసరాలు ఎంత వచ్చే దిగుబడి ఎంత మిగిలిన పంటను ఏం చేయాలి అనేది ఇప్పటినుంచి సరిగ్గా ప్లాన్ చేసుకోవాలని రైతు నాయకులు అంటున్నారు.

(ఎ.వి.డి. శర్మ)

ఎఫ్టానిక్స్‌లో ఆర్‌విఆర్ విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి-గుంటూరు

ఎఫ్టానిక్స్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో తమ కళాశాల విద్యార్థులు ఆరుగురు విద్యార్థులకు రూ.5.3 లక్షల వేతన ప్యాకేజీతో ఉద్యోగాలు సాధించారని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజనీరింగ్ కాలేజి అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె.మద్దినేని పేర్కొన్నారు. శనివారం ఉద్యోగాలు పొందిన విద్యార్థులను కళాశాల సిబ్బంది అభి నందించారు. తమ కళాశాల విద్యార్థులకు అధిక ప్యాకేజీతో కూడిన ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు బహుళ అంతర్జాతీయ కంపెనీలు ముందుకురావడం గర్వకారణమని కళాశాల సెక్రటరీ, కరెస్పాండెంట్ రాయపాటి గోపాల కృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె. కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. ఉద్యోగాలు సాధించిన సిఎస్ఈ చివరి సంవత్సరం చదువుతున్న కె.రాహుల్‌దేవ్, ఎమ్.డి.ఫర్హాన్‌ఫైజ్, అభినయ్ కుమార్‌రెడ్డి, అలాగే ఈసిఈ విద్యార్థులు గారపాటి దిలీప్, శ్రీసాయి, ఎస్.ఆదిసయాన్‌బోస్, మారం వెంకట మైధిలిని ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

కిట్స్ అక్షర్‌లో ఎన్‌సిసి దినోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు

యనమదలలోని కిట్స్ అక్షర్ కళాశాలలో ఎన్‌సిసి వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా కళాశాల ఎన్‌సిసి విద్యార్థులు మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల డైరెక్టర్ గోగినేని సాంబశివరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మొక్కల పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు, సెక్రటరీ కోయి శేఖర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామకోటయ్య, వివిధ విభాగ అధిపతులు, ఏఒ, 25 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సిసి ఏఎన్‌ఒ బి.ఎన్.మల్లిఖార్జురావు తదితరులు పాల్గొని మొక్కలు నాటారు.

మొక్కను నాటుతున్న కాలేజి డైరెక్టర్ సాంబశివరావు, విద్యార్థులు

వరద బాధితులకు డాక్టర్ విజయ సాయం

ప్రజాశక్తి-గుంటూరు

ఇటీవల వరదలకు సర్వం కోల్పోయిన బాధితులకు అండగా నిలవటంలో భాగంగా పెదలంక గ్రామానికి చెందిన సుమారు 25 కుటుంబాలకు లలితా గ్రూఫ్ ఆఫ్ హాస్పిటల్స్ తరపున ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ విజయ సహాయం అందచేశారు. శనివారం లలితా హాస్పిటల్ ప్రాంగణంలో బాధిత కుటుంబాలకు బియ్యం, కందిపప్పు, వంట నూనె వంటి నిత్యావసర సరుకులు, దుప్పట్లు, చీరలు, దుస్తులు మొదలైనవి పంపిణీ చేశారు.

నిత్యావసరాలు, ఇతర వస్తువులు అందచేస్తున్న డాక్టర్ విజయ